ఆదివారం
ప్రజాశక్తి
ఏప్రిల్ 25, 2004



విలక్షణ తార విషాదాంతం

హ్యాపీ బర్త్‌డే

(25-4-2004నుండి 1-5-2004వరకు)

శ్రీనివాస్‌చారి
1సం॥, 25.4.2003
సావిత్రీసూజాత-బాషయ్యచారి
ముత్రాజుపల్లి-మెదక్

వెంకటమహేశ్వరి
6సం॥, 25.4.1998
శైలజ-మదన్‌మోహన్
వలేటివారిపాలెం-ప్రకాశం

సాయిశ్రీలక్ష్మి
2సం॥, 26.4.2002
అనసూయ-సురేష్
సూరప్పగూడెం-ప॥గో॥

స్మరాజ్-స్వరూప్
3సం॥, 27.4.2001
పద్మావతి-సత్యనారాయణ
విశాఖపట్నం

మోహసిన్
3సం॥, 27.4.2001
సమీనాబేగం-హామద్‌అలీషా
ఐలపర్రు-ప॥గో॥

టి.జి.శ్రీసత్య నాగవల్లి
4సం॥, 27.4.2000
రత్నం-బుజ్జి
ఆచంట-ప॥గో॥

సాయికిరణ్
4సం॥, 27.4.2000
నగరాజకుమారి-శ్రీనివాసరావు
గన్నవరం-ప్రకాశం

రవళిక
1సం॥, 28.4.2003
చంద్రకళ-వీరన్న
మహబూబాబాద్-వరంగల్

పి. శశిగిద్యోను
1సం॥, 28.4.2003
మేరి-నాగరాజు
ఇబ్రాహీంపట్నం-కృష్ణా

డి.స్వాతి
4సం॥, 28.4.2000
శ్రీలత-శ్రీరామచంద్రమూర్తి
ఉక్కునగరం-విశాఖపట్నం

ఎం.అఖిల్
4సం॥, 28.4.1995
శాంతి-లక్ష్మణరావు
విజయవాడ

అఖిల్
3సం॥, 29.4.2001
సరస్వతి-సుధాకర్
గార్గేయపురం-కర్నూలు

నీలిమ(అమ్ము)
2సం॥, 29.4.2002
లక్ష్మీదేవి-బాలనాగు
మదనపల్లి-చిత్తూరు

ప్రభాకర్
1సం॥, 1.5.2003
రత్నకుమారి-శివన్నారాయణ
పల్లెర్లమూడి-కృష్ణా

స్వాతి
గీత-యాదగిరి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

దీపిక(చిన్ని)
3సం॥, ఏప్రిల్
శోభ-మల్లారెడ్డి
బొంగోనిచెర్వు-నల్లగొండ

రాకేష్(కిషన్)
ఆండాలు-రెడ్యా
మహబూబబాద్-వరంగల్

జి.భవాని
4సం॥, ఏప్రిల్-2000
పద్మావతి-రామయ్య
అంచులవారిపాలెం-గుంటూరు

ముఖేష్‌బాబు(చింటు)
1సం॥, ఏప్రిల్-2003
జ్యోతి-శేఖర్
నవాబుపాలెం-ప॥గో॥

టి. వర్ధన్
1సం॥, ఏప్రిల్-2003
సుభాషిణి-శేఖర్
శంకర్‌పల్లి-రంగారెడ్డి

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ ఆకట్టుకుంది

ఆదివారం ప్రజాశక్తి కవర్‌స్టోరీ మా ఇంట్లో చిన్న పిల్లలందర్నీ ఎంతో ఆకట్టుకుంది. వేసవి సెలవుల్లో ఎలా గడపాలి అనే ఆసక్తికరమైన అంశాలు సరైన సమయంలో అందించినందుకు మాపిల్లలందరూ ఎడిటర్ అంకుల్‌కి థ్యాంక్స్ చెప్పమన్నారు. ఈ వేసవిలో ఎక్కువ పచ్చకామెర్లు వస్తాయి. 'కామెర్లు-జాగ్రత్తలు' శీర్షిక తీసుకోవలసిన జాగ్రత్తలు, అనేక ఆసక్తి విషయాలు విపులంగా వివరించినందుకు డా॥ నాగినేని భాస్కరరావుగారికి ధన్యవాదాలు

- చిప్పాడ ఉమామహేశ్వరరావు,
కురుపాం, విజయనగరం జిల్లా

ముఖచిత్రం బాగుంది

ఏప్రిల్ 11 ఆదివారం ప్రజాశక్తి అల్లరిపిడుగులు బాలల క్రీడా ముఖచిత్రం చాలా అందంగా వుంది. ఒకపూరి కథ చాలా బాగుంది. పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ గారి స్వరాంజలి, డా॥ నాగినేని భాస్కరరావు గారి 'కామెర్లు-జాగ్రత్తలు' చాలా బాగా వివరించారు. వల్లం నరసింహారావు గారు సినిమా ద్వారాపరిచయం ఉన్న వారు. నటుడిగా తెలుసు గాని, ఆయన గురించి తెలియని వాళ్ళకు తెలిసేలాగా నరసింహారావుగారితో ఇంటర్వ్యూ చాలా బాగుంది.

- ఆర్.శ్రావణి,
విద్యానగర్, హుజూరాబాద్.

మనలోమాట హైలైట్

ఏప్రిల్ 11వ తేదీ ఆదివారం సంచికలో మనలోమాట శీర్షికన 'నేటి రాజకీయం' అనే కాప్షన్‌తో వచ్చిన అంశం చాలా బాగుంది. కాప్షన్స్‌కు తగ్గట్లుగా మంచి ఉదాహరణలతో వివరించిన వైనం ఆద్యంతం చాలా చక్కగా రాశారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఐటెమ్‌ను మా ఫ్యామిలీ మొత్తం ఒకరి తర్వాత ఒకరం చదువుకుని ప్రజాశక్తిని మెచ్చుకున్నాం. అలాగే రుచి శీర్షికలోని ఎగ్‌పుడ్డింగ్‌ని వండుకుని, కుటుంబం మొత్తం తిని ఎంజాయ్ చేశాం. టేస్ట్ చాలా ఎక్స్‌లెంట్‌గా వుంది. పుస్తక పరిచయంలో కారల్‌మార్క్స్ జీవిత కథ బాగుంది. 'వివేకానందస్వామి' జీవిత కథ ప్రచురించగలరు.

- జి.వి.లక్ష్మణ ఆంజనేయులు,
ఫోర్ట్‌రోడ్, మచిలీపట్నం.

వల్లం నరసింహారావు గురించి తెలుసుకున్నాం

11 ఏప్రిల్ 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన ప్రజానటుడు నాటక ప్రక్రియకు సరికొత్త ఒరవడి తీసుకొచ్చిన ఘనత ఒక్క వల్లం నరసింహారావుగారికే దక్కుతుంది. రంగస్థల నటుని స్థాయి నుండి వెండితెర నటుని స్థాయి వరకు అనేక పాత్రలలో జీవించి ఆయా పాత్రలకే వన్నె తెచ్చిన నరసింహారావుగారు నిజంగానే కళారంగానికి ఎనలేని సేవలందిస్తున్నారు.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

ఆద్యంతం ఆసక్తికరం

'హ్యాపీబర్త్‌డే'లో బుజ్జాయిల పలకరింపు...
'రీడర్స్‌మెయిల్'లో పాఠకుల మేళవింపు...
'మనలోమాట' మనస్సులను కలిపేను...
'కార్టూన్ కదంబం' కడుపుబ్బ నవ్వించేను...
'కవర్‌స్టోరీ'లో కావలసినంత పరిజ్ఞానం...
'కథ'తో ఆదివారం భలే కాలక్షేపం...
'కచేరి'లో వ్యంగ్యం... వర్ణన కడు రమ్యం...
'ఆరోగ్యం' అందించును... అమూల్య సమాచారం...
'పుస్తకపరిచయం' తెరచును జ్ఞానగవాక్షం...
'టూరిస్ట్‌గైడ్'లో విహారం చేసేస్తాం...
'న్యాయసలహాల' మాలతో వివాదాలు పరిష్కరించేస్తాం...
'రుచి'లో వంటలతో ప్రతీ ఆదివారం ఖుషీ... ఖుషీ...
ఆదివారం ప్రజాశక్తి కలిగించును ఆద్యంతం ఆసక్తి...

- పవని భానుచంద్రమూర్తి,
చీరాల, ప్రకాశం జిల్లా

రుచి నిబంధనలు మార్చాలి

ఏప్రిల్ 11 ఆదివారం ప్రజాశక్తి సంచిక చాలా బాగుంది. పర్యాటక స్థలాలు, వేసవి విడిదిల గురించి చాలా బాగుంది. అయితే రుచి శీర్షికలో మీరు చిన్న మార్పు చేయాలి. అది ఏమిటంటే వంటలకు ఫొటోలు తీయడం అన్న నిబంధనను సడలించాలి. ఎందుకంటే అది అందరికీ సాధ్యమయ్యే పని కాదు. కెమెరాలు అందరి ఇళ్ళల్లో వుండకపోవచ్చు. అందువల్ల ఎక్కువ మంది పాల్గొనడం లేదు. ఇది మా రీడర్స్ అందరి సజెషన్. మరి మీరేం చెబుతారు? పత్రికాముఖంగా సమాధానం చెబుతారని ఆశిస్తున్నాను. మేము అభిమానించే పత్రిక కాబట్టి ఈ సలహా ఇచ్చాం. మా దగ్గర చాలా రచనలు ఉన్నాయి. మీ సమాధానం బట్టి పంపిస్తాము. మంచి మంచి శీర్షికలతో పత్రిక చాలా బాగుంది.

- కోట శ్రీదేవి, గౌరీశంకర్ కాలనీ,
శృంగవరపుకోట, విజయనగరం జిల్లా

గమనిక : రుచి శీర్షికకు వంటలు పంపించే వారి ఫొటోలు, వంటల ఫొటోలు తప్పనిసరికాదు. వీలైతే ఫొటోలు పంపవచ్చు. లేదా వంటకం గురించి రాసి పంపవచ్చు.

ఓటరు పాట్లు...

ఒకానొక బక్కజీవి తన పెన్షన్ డబ్బుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళాడు...

నువ్వు బతికున్నట్లు సర్టిఫికెట్ తీసుకురమ్మని అక్కడి గుమాస్తా మహాశయుడు ఆ బక్కజీవిని ఆదేశించాడు..

కళ్ళెదుటే కనిపిస్తున్నా కదయ్యా... ఇప్పుడా సర్టిఫికెట్ తెమ్మంటే నేనెక్కడ తెచ్చేది అని ఆ పెన్షన్‌దారుడు తన గోడు వెళ్ళబోసుకుంటే... రూల్స్ అలా తగలడ్డాయి.. నేనేం చేసేది అన్నాడట ఆ సగటు ఉద్యోగి.. అవును మరి రూల్స్ ఆ విధంగా అఘోరించినపుడు అతనేం చేస్తాడు... తప్పు అతనిది కాదు రూల్‌ది అని ఒప్పుకోక తప్పదు...

ప్రజాస్వామ్య దేశాల్లో ఓటరు నేతల రాతలు రాస్తాడు... కాని మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో ఓటరు రాతలను ఎన్నికల సంఘం, అధికారపార్టీ కలసి రాస్తాయి...

ఎన్నికల్లో గెలిచేందుకు నేతలు ఓటరు దయా దాక్షిణ్యాల మీద ఆధారపడితే– ఓటరు మాత్రం అధికారపార్టీ కరుణా కటాక్షాల మీద ఆధార పడాల్సి వస్తోంది.. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు కోసం అధికారపార్టీని, అధికారులను దేబిరించాల్సి వస్తోంది. ఇదే నేటి భారతం..

గతంలో ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండేది..

ప్రజల్లో ఎక్కువమంది తమ ఓటు హక్కును వినియోగించుకునేవారు..

రాను రాను మేధావులెక్కువవుతున్నారు... ఓటింగ్ శాతం తగ్గిపోతోంది. రాజకీయ నాయకులమీద, రాజకీయాల మీద విమర్శలు చేసే ఈ మేధావులు ఓటు మాత్రం వేయరు...

ఓటేద్దామనుకునే సామాన్యుడి పేరేమో ఓటర్ లిస్ట్‌లో ఉండదు...

గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేయనిస్తామని ఢంకా బజాయించి చెప్పిన అధికారులు తీరా కార్డు పట్టుకెళ్ళి ఓటు అడిగితే నీ పేరు లేదు పొమ్మంటున్నారు...

భారతీయుడిగా గుర్తించి ప్రభుత్వం వారిచ్చిన గుర్తింపు కార్డు చూపించినా మా లిస్ట్‌లో నీ పేరు లేదు అంటున్నారు. పేరు ఉన్నవారిని గుర్తింపు కార్డు లేకుండా నిన్ను గుర్తించడం ఎలా అని దబాయిస్తున్నారు...

బోగస్ ఓట్లు చేర్పించారని ప్రతిపక్షాలు గగ్గోలు పెడితే బోగస్ వాటితో పాటు అసలైనవారి ఓట్లు కూడా తీసిపారేశారు.. అదేమంటే ప్రతిపక్షాల కుట్ర వల్లే ఇదంతా జరిగిందని ఏలిన వారు దుమ్మెత్తిపోస్తున్నారు..

ఏలినవారు చేలో మేస్తే అధికారులు గట్టున మేస్తారా?

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

కరెంటు తీగలు

కథ... 8, 9

పదగ నీడలో పసితనం



రియల్‌స్టోరీ... 14, 15



పర్యాటకుల స్వర్గధామం విశాఖ జిల్లా

టూరిస్ట్ గైడ్ . . . 21

గురు కేలూచరణ్ అంటేనే... ఒడిస్సీ నృత్యం

కళాసాహితి . . . 22, 23

ఔరా!

అక్కడ నవ్వరాదు!

నవ్వు నాలుగు విధాల గ్రేట్ అని, ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరూ అంటుంటే బీహార్ సుప్రీం లల్లూప్రసాద్ యాదవ్ మాత్రం తన ముందు ఎవరూ నవ్వడానికి వీల్లేదంటున్నారట! బీహార్‌లోని సంజయ్‌గాంధీ బొటానికల్ గార్డెన్, జూలో నవ్వడానికి వీల్లేదని ఆయన ఆదేశాలు జారీచేశారు. లల్లూ గారు ప్రతిరోజూ ఆ జూపార్క్‌లో మార్నింగ్ వాక్‌కు వెళతారు. ఒక రోజున ఆయన అలా నడిచి వెళుతుండగా ఒకచోట "లాఫింగ్‌క్లబ్" సభ్యులు పకపకా నవ్వుతున్నారట. అది చూసిన లల్లూ గారికి చిర్రెత్తుకొచ్చింది. పగలబడి నవ్వుతూ జూలో వాయుకాలుష్యం సృష్టిస్తున్నారని లాఫింగ్‌క్లబ్ సభ్యులపై కోపగించుకుని జూలో ఇకపై ఎవరూ నవ్వరాదని హుకుం జారీచేశారట! పాపం.



ముంత నీళ్ళ రు.3650లు !?

ఒక చిన్న ముంతెడు నీళ్ళు 3650 రూపాయలట! అంత ధర పెట్టి కొన్నారట కూడా. స్త్రీలు మాతృత్వం కోసం ఎంత తహతహలాడుతారో, మన సమాజంలో మూఢ నమ్మకాలు ఎంత బలంగా వేళ్ళూనుకున్నాయో ఒరిస్సాలో ఏడాదికోసారి జరుగుతున్న ఈ మహత్తు గల నీళ్ళ వ్యాపారం చూస్తే తెలుస్తుంది. ఒరిస్సాలో మారుమూలన గల లింగరాజ్ ఆలయ ప్రాంగణంలోని బావి నీటికి మహత్తులున్నాయని ఎప్పటి నుండో అక్కడివారు నమ్ముతున్నారు. మరీచికుండగా పిలిచే ఆ బావిలోని నీరు అశోకాష్టమి నాడు ఒక ముంతడు తాగితే పిల్లలు లేనివారికి పిల్లలు పుడతారని నమ్మకం. ఆ శుభదినాన బావిలోనుండి తీసే మొదటి మూడు ముంతల నీటికి బాగా డిమాండ్ ఉంటుందట. అందుకని మొదటి మూడు ముంతల నీటిని వేలం వేసి తర్వాత వారికి నామమాత్రపు ధరకు తలా ఒక ముంతెడు నీరిస్తారట! ఈసారి ఆ మూడు ముంతల నీటికి వరుసగా 3,650, 2,450, 1,600 రూపాయలు ధర పలికిందట. రోజంతా అమ్మిన మొత్తం నీటికి రు. 16,130ల ఆదాయం వచ్చిందట దేవాలయానికి!

సినిమా స్టైల్‌తో పరీక్ష డిబార్

నేటి యువత ఎక్కువగా తాము అభిమానించే సినిమా తారలను రకరకాలుగా అనుకరిస్తున్నారు. ఇబ్బంది లేనంతవరకూ ఏదైనా చెల్లుబాటవుతుంది. ఇటీవల హిందీలో సూపర్‌హిట్ అయిన 'మున్నాభాయ్ ఎంబిబిఎస్' సినిమా చూసిన సంజయ్‌దత్ అభిమాని ఒకరు అందులోని ఒక సన్నివేశాన్ని నిజజీవితంలో అనుకరించడానికి ప్రయత్నించి బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకున్నాడు. థానేలో పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ఆ విద్యార్థి హైటెక్ కాపీయింగ్ చేయబోయాడు. ఈ సినిమాలో మాదిరిగా సెల్‌ఫోన్, ఇయర్‌ఫోన్లతో పరీక్షహాల్‌లోకి వచ్చాడు. సెల్‌ఫోన్ కనిపించకుండా రహస్యంగా దాచుకుని కంటికి కనిపించని వైర్లతో ఇయర్‌ఫోన్ పెట్టుకుని బయట స్నేహితులు చెబుతున్న జవాబులను వింటూ సీరియస్‌గా రాసేస్తున్నాడు. మొత్తం మీద ఇన్విజిలేటర్ దృష్టిలో పడ్డాడు. పరీక్షల నుండి డిబార్ అయ్యాడు. తన ఈ సాహసానికి మున్నాభాయ్ సినిమా 'స్ఫూర్తి' అని చెప్పాడట ఆ విద్యార్థి. ఆ హిందీ సినిమా ఇప్పుడు తెలుగులో కూడా రాబోతోంది.

ఎన్నికల ప్రచారం సమాప్తం

కార్టూన్ కదంబం


కంగ్రాచులేషన్స్ ఎగ్జిట్ పోల్‌లో గెలిచినందుకు
ఎగ్జిట్ పోల్ 2004
ఇది పోలింగ్‌లో అదీ ఎగ్జిట్ పోల్‌లో పోయించారు
ఓటింగ్ యంత్రాల్లో ప్రతిపక్షాల ఓట్లన్నీ ఎగ్జిట్ అవుతున్నాయి
ఎగ్జిట్ పోల్ బూత్


ఓటు మీరు వేస్తారా మమ్మల్ని వేసుకోమంటారా
ఓటు
పోలింగ్ స్టేషన్
పోలింగ్‌కు భారీ భద్రత
నరు

ఆమె చిన్న వయసులోనే పెద్ద పాత్రలు పోషించింది.

వంద సినిమాల్లో రకరకాల పాత్రలు ధరించింది. ఆ సినిమాలు, వాటిలో ఆమె పాత్రలు సినిమాటిక్ మలుపులమధ్య ఏమవుతాయా అని ప్రేక్షకులు ఉత్కంఠగా చూసేవారు.

కాని ఆమె జీవితం మాత్రం ఎవరూ ఊహించని విధంగా ముగిసిపోయింది.

హోరాహోరీ ఎన్నికల పోరాటంలో భీకరంగా తలపడుతున్న వేర్వేరు పక్షాల వారంతా కూడా ఆమె దుర్మరణానికి కన్నీటి బొట్లు విడిచారు.

సినీ పరిశ్రమ, మీడియా, రాజకీయరంగం మాత్రమే కాదు- సామాన్య ప్రేక్షకలోకం ఆ ప్రతిభావంతురాలికి శ్రద్ధాంజలి ఘటించింది.

అనుకోని విధంగా, అందులోనూ అత్యంత ఘోరంగా ఆ సౌందర్యమూర్తి నేలకూలి కాలిపోవడం నిజంగానే వూహకందని విషాదం.

విలక్షణ తార విషాదాంతం

పీపీ

సౌందర్య సహజ నటి. సినిమా కుటుంబంలో పుట్టిన ముద్దుల పట్టి. కన్నడసీమ నుంచి వచ్చినా పదహారణాల తెలుగు బిడ్డ అనిపించుకున్న అభినేత్రి. ఆమె తండ్రి సత్యనారాయణ కన్నడంలో చాలా సినిమాలు నిర్మించారు. కూతురును కథానాయికను చేయాలని ఆయనకు మొదటినుంచి వుండేదట. అయితే మరోవైపున సౌందర్య చదువు సాగిస్తూనే వుంది. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో చేరింది. సరిగ్గా అప్పుడే త్రిపురనేని చిట్టి ఆమె గురించి విన్నాడు. ఆయన ప్రముఖ రచయిత మహారథి కుమారుడు. తండ్రి దర్శకత్వంలో తను నిర్మించే 'రైతుభారతం'లో ఆమెను నాయికగా బుక్ చేసుకోవాలని భావించాడు. సత్యనారాయణతో మాట్లాడి ఆమెను చూడ్డానికి ఇంటికి వెళ్లాడు. సహజంగా చూడాలనే భావంతో చెప్పిన టైముకన్నా ముందే వెళ్లాడట. ఉదయాన్నే ఆమెను చూసిన వెంటనే స్క్రీన్ టెస్టు కూడా లేకుండానే అడ్వాన్స్ ఇచ్చి వచ్చేశాడు. తమ చిత్రం పూర్తయ్యే వరకు ఆమె వేరే సినిమాల్లో నటించకూడదని ఒప్పందం. కాని ఆ సినిమా బాగా ఆలస్యమైంది. ఈలోగా సౌందర్యకు మనవరాలి పెళ్లిలో దర్శకుడు పిఎస్‌రామచంద్రరావు చిన్న పాత్ర ఇచ్చాడు. ఈ లోగా ఆమె 'గంధర్వ' అనే కన్నడ చిత్రంలోనూ నటించే అవకాశం వచ్చింది. తన ఒప్పందం ఆమె భవిష్యత్తుకు ఆటంకం కారాదనే ఉద్దేశంతో చిట్టి మొదట పెట్టిన షరతు ఉపసంహరించుకున్నాడు. 'అసలే పెళ్ళయినవాణ్ని' షూటింగ్ సమయంలో ఆమెను చూసిన రచయిత దివాకర్‌బాబు తన దర్శకుడు ఎస్వీకృష్ణారెడ్డికి సిఫార్సు చేశాడు. దాంతో సౌందర్య దశ తిరిగింది. మనవరాలి పెళ్లి కోసం పనిచేస్తున్నప్పుడే సౌమ్య అన్న అసలు పేరు సౌందర్యగా మారిపోయింది.

తొలిరోజులు...

సౌందర్యను తెలుగు ప్రేక్షకులు చెప్పుకోదగిన పాత్రలో చూసింది 'రాజేంద్రుడు - గజేంద్రుడు' సినిమాలో. కృష్ణారెడ్డి ప్రధానంగా పిల్లలను దృష్టిలో పెట్టుకుని తీసిన ఈ హాస్యచిత్రంలో హీరో రాజేంద్రప్రసాద్. పూటకు ఠికాణా లేని అతనికి లాటరీలో ఏనుగు తగలడం కథ. ఆ ఇంటి ఓనరు కుమార్తె సౌందర్య. హీరోను ప్రేమించి వెంటపడుతుంటే అతగాడు విసుక్కుంటుంటాడు. ఏనుగు కథ గనక అదే వాళ్ల ప్రేమ పండిస్తుంది. ఆ వెంటనే కృష్ణారెడ్డి తీసిన మరో సూపర్ హిట్ 'మాయలోడు'లోనూ ఆమె నాయిక. ఈ సినిమాలో బాబూమోహన్‌తో 'చినుకు చినుకు సందడితో' పాట వుంటుంది. ఈ పాటే తర్వాత శుభలగ్నంలో ఆలీతోనూ, మరో సినిమాలోనూ వరుసగా ఉపయోగించాడు కృష్ణారెడ్డి. ఈ చిత్రాల తర్వాత రాజేంద్రప్రసాద్ స్వంత చిత్రం 'మేడమ్'లోనూ సౌందర్యనే నాయికగా తీసుకున్నారు. ఆ చిత్రంలో పాత్ర పేరు కూడా సౌందర్యే. కృష్ణారెడ్డి దర్శకత్వంలోనే బాలకృష్ణతో టాప్‌హీరోలోనూ, కృష్ణతో నెంబర్ వన్‌లోనూ సౌందర్య నాయికగా చేసింది. వాస్తవానికి రైతుభారతంలోనూ కృష్ణే హీరో కనక ఆయనతోనే ఆమె సినీ జీవితం మొదలై వుండాల్సింది.

స్థాయి పెంచిన సినిమాలు.. వరుసగా అవార్డులు...

'పవిత్రబంధం' 'రాజా' ఆమెలోని నటనను చూపించాయి. ఈ చిత్రాలలో వెంకటేష్ కథానాయకుడు.

సౌందర్యను బలిగొన్న తాతలనాటి విమానం

ఏ ఘటనకైనా పూర్వరంగం ఉంటుంది. సౌందర్య దుర్మరణం పాలకుల విధానాల దుష్ఫలితమే. ఉదారవాద ఆర్థిక విధానాల అమలులో భాగంగానే ప్రయివేటు రంగంలో విమాన యానం ఆరంభమైంది. లోక్‌సభ స్పీకర్ బాలయోగి, కాంగ్రెస్ నాయకుడు మాధవరావు సింధియాలను బలిగొన్నది కూడా ప్రయివేటు సంస్థల విమానాలే. ఈ సంస్థల విమానాల్లో ప్రయాణించి మరెందరో ప్రముఖులు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. 15 సంవత్సరాలు దాటిన స్కూటర్లే రోడ్డు మీద తిరగడానికి వీల్లేదని శాసిస్తున్న ప్రభుత్వాలు 50 ఏళ్ళ నాటి ముసలి విమానం ఆకాశంలో తిరుగుతున్నా అభ్యంతరం చెప్పకపోవడమే ప్రయివేటు సంస్థల పట్ల వారి ప్రేమను వెల్లడిస్తోంది. పాలకుల విధానాలే ప్రయివేటు విమానం రూపంలో సౌందర్యను బలిగొన్నాయి. ఇంకెంత మందిని బలితీసుకుంటాయో?

పాత్రలు ఘర్షణాత్మకమైనవి. కేవలం గ్లామర్, కేవలం నటన అనే మూసలలో చిక్కుకుపోకుండా జనాదరణ పొందగల సత్తా సౌందర్యకు వుందని ఈ చిత్రాలు నిరూపించాయి. 'అపూరూపమైనదమ్మ ఆడజన్మ- ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా ' అనే సంప్రదాయిక సందేశంతో తీసిన చిత్రమైనా 'పవిత్రబంధం'లో ఆమెది గంభీరమైన నాయిక పాత్ర. దాని తర్వాతే తన పారితోషికం పెరిగిందని ఆమె చెప్పారు. నిజానికి ఆమె పారితోషికం విషయంలో పట్టువిడుపులతో వుండేదని, పాత్ర, కథలకే ప్రాధాన్యతనిచ్చేదని నిర్మాతలు చెబుతారు.

సౌందర్య పాత్రలలో అంతఃపురం ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఎక్కడో మలేషియాలో హీరోను ప్రేమించి పెళ్లి చేసుకున్న నాయిక ఏ అవగాహన లేకుండా అత్తగారింటికి వస్తుంది. అక్కడ ఫ్యాక్షన్ల విశ్వరూపం అర్థం చేసుకునేంతలో భర్తను కోల్పోతుంది. వారసుడొచ్చాడని మనవడిని వదలని తాతయ్య ప్రకాశ్‌రాజ్ నుంచి తన కొడుకును దూరంగా తీసుకుపోవడమే ఆమె ఏకైక లక్ష్యం. అందుకోసం ఆమె పడే ఘర్షణ, ఎదుర్కొనే కష్టాలు, బాధలు అద్భుతంగా అభినయించి అటు ప్రకాశ్‌రాజ్ ఇటు ఊర్వశి శారదల మధ్య వారికేమీ తీసిపోని రీతిలో ఆ పాత్రను పండించిన సౌందర్య నంది అవార్డు పొందింది. అంతకు ముందు 'పవిత్ర బంధం'లో నటనకు కూడా అవార్డు దక్కింది. వీటితో పాటు సినిమాకు గాను పరిశ్రమ ప్రతిష్టాత్మకంగా పరిగణించే ఫిలింఫేర్ అవార్డు వచ్చింది.

రఘుతో సౌందర్య వివాహ దృశ్యం

ఇవన్నీ ఒక ఎత్తు అయితే స్వంతంగా నిర్మించిన కన్నడ చిత్రం 'ద్వీప'కు జాతీయ అవార్డు పొందడం ఆమెకు మరింత సంతోషం కలిగించింది. ఈ చిత్రం కోసం ప్రముఖ దర్శకుడు గిరీష్ కాసరవల్లిని ఎన్నుకోవడంలోనే ఆమె అభిరుచి తెలుస్తుంది. ఊరి ఉమ్మడి బాగుకోసం సంప్రదాయాన్ని ధిక్కరించడానికి వెనుకాడని సాహస మహిళ కథ అది. దానికి లభించిన ప్రోత్సాహంతోనే ఆమె తెలుగులో గిరిజనులకు సంబంధించి 'కమలి' అనే చిత్ర నిర్మాణాన్ని తలపెట్టారు. దీనికి కూడా అవార్డు దర్శకుడు, సినీ పాత్రికేయుడు కెఎన్‌టి శాస్త్రిని తీసుకున్నారు. ఎన్నికల ప్రచారం వల్ల ఆలస్యమైన ఈ సినిమా షూటింగు ఇక అలా నిలిచిపోవల్సిందేనని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

తమిళంలోనూ అగ్రనటి

సౌందర్య కన్నడ అమ్మాయి అయినా నటిగా రాణించింది తెలుగులోనే. అందుకే ఆమె తెలుగు సినిమాకే అత్యధిక ప్రాధాన్యతనిచ్చేది. అదే సమయంలో ఇతర భాషలలోనూ బాగానే నటించారు. మాతృభాష కన్నడంలో 'గంధర్వ, శ్రీ రేణుకాంబ, విజయదశమి, ద్వీప చిత్రాలలో నటించారు.

ఇక తమిళంలో ఆమె తెలుగులో వలెనే అగ్రహీరోలందరికతోనూ నటించి ఘనవిజయాలు సాధించారు. 1993లోనే కార్తీక్ సరసన ఆమె తొలిసారిగా 'పొన్నుమణి' లో మనస్తిమితం లేని పాత్రలో నటించారు. 1997లో రజనీకాంత్‌తో 'అరుణాచలం' లోనూ, 1998లో కమల్‌హాసన్‌తో 'కాదల కాదల'లోనూ నటించారు. ఆ తదుపరి సంవత్సరం రజనీతో చేసిన పడయప్ప (తెలుగులో నరసింహ) పెద్ద విజయం సాధించి ఆమెను తమిళంలో సూపర్ స్టార్‌ను చేసింది. మామూలుగా అసభ్య సన్నివేశాలను, ఎక్స్‌పోజర్‌కు దూరంగా వుండే సౌందర్య ఆ చిత్రంలో కూడా అలాటి పాత్రనే వేసింది. గడసరిగానూ, ఓవర్‌స్పీడ్‌తోనూ సాగే రమ్యకృష్ణ నీలాంబరి పాత్రకు సమాంతరంగా సాగే పాత్రకు ఆమె సరిగ్గా సరిపోయింది. 2001లో ఆమె మరో పెద్ద హీరో విజయకాంత్‌తో 'తవసి'లో నటించింది. ఈ సినిమాలన్నీ సౌందర్యను తమిళ ప్రేక్షకులకు దగ్గర చేశాయి.

గ్లామర్, ఫెర్ఫామెన్స్, డీసెన్సీ....

ఇవే సినిమా పరిశ్రమలో సౌందర్య పాటించిన మూడు సూత్రాలు. సాధారణంగా గ్లామర్ తారలని, ఫెర్ఫామెన్స్ ఆర్టిస్టులని విభజిస్తుంటారు. ఈ రెండింటితో పాటు మితిమీరిన ఎక్స్‌పోజర్ పట్ల పట్టింపు లేని తారలు కూడా వుంటారు. వాస్తవానికి సినిమా అన్నాక ఈ మూడింటిలో ఏవో రెండు అంశాల కాంబినేషన్ వుంటుంది. గ్లామర్, పెర్ఫామెన్స్ కూడా మేళవించిన వారే మహానటీమణులవుతుంటారు. వారిలో కూడా కొందరు అప్పుడప్పుడూ ఎక్స్‌పోజర్ విషయంలో రాజీ పడుతుంటారు. మరీ పాతవారిని పక్కన బెడితే సావిత్రి, వాణిశ్రీ, జయసుధ, సుహాసిని, ఈ కోవలో వేరే విధంగానైనా శ్రీదేవి, శారద తమ సత్తాచాటుకున్నవారు. తర్వాతి తారలలో రవళి, రోజా, మీనా, రంభ, నగ్మా తదితరులు వచ్చారు గాని ఎవరూ ఇంతకాలం వుండి, ఇంత వైవిధ్యంగల పాత్రలు ధరించలేదు. నిజానికి ఒక్కో సినిమాకు హీరోయిన్ మారిపోతున్న కాలం. రెండేళ్లకు మించి నాయికలకు అవకాశాలుండవని చెబుతున్నారు. ఈ మధ్యనే వచ్చిన ఆర్తీ అగర్వాల్‌ను కూడా అప్పుడే పెద్దపాత్రలవైపు మరలుస్తున్నారు. ఇక సౌందర్య తరహా పాత్రలు మరీ తక్కువ. కళ్యాణి, లయ మాత్రమే అదీ

సావిత్రి-ద్రౌపది

తెలుగు సినిమా నవీన నాయికల శకం సావిత్రితోనే ప్రారంభించాల్సి వుంటుంది. అందం, అభినయం మూర్తీభవించిన మంచి తారలు ఎవరొచ్చినా అనివార్యంగా ఆ మహానటితోనే పోల్చుతుంటారు. ఈ జాబితాలో స్థానం సంపాదించిన సౌందర్యలేని వెలితి తీర్చేవారెవరన్నది ప్రశ్నే. అయితే ఆ స్థానాన్ని మాత్రమే కాక సావిత్రి పోషించిన ఒక గొప్ప పాత్రను కూడా ఆమె మధ్యలో వదిలేసి పోవడం యాదృచ్ఛికమైన వాస్తవం. పాండవ వనవాసం, నర్తనశాల చిత్రాలలో సావిత్రి ఎన్టీఆర్ తదితరుల సరసన ద్రౌపదిగా నటించారు. నర్తనశాలలో కీచకున్ని నర్తనశాలకు రప్పించి అంతమొందించే ఘట్టంలోనూ, తర్వాత కీచక సోదరులు హింసించే సందర్భంలోనూ ఆమె అమోఘంగా నటించారు. బాలకృష్ణ ముచ్చటపడి స్వీయదర్శకత్వంలో నాన్నగారి పాత్రలు వేస్తూ పునర్నిర్మిస్తున్న ఈ చిత్రంలో సౌందర్య ద్రౌపదిగా నటిస్తూండగానే ఈ విషాదం సంభవించింది. ఆ షూటింగు సందర్భంగా పత్రికల వారితో మాట్లాడుతున్నప్పుడు ఆమె పదే పదే సావిత్రిని స్మరించడం, తనకు గొప్ప అవకాశం లభించిందని ఆనందం వెల్లడించడం ఆమె నమ్రతను వెల్లడించాయి. 'మహానటి సావిత్రి గారు చేసిన పాత్ర. సోషల్ పిక్చర్స్ అంటే ఏదో చేస్తాం. కాని ఎపిక్స్‌లో రిస్కు తీసుకోకూడదు. లోగడ గొప్పవారు ఎలా చేశారో జాగ్రత్తగా చూసి చేయాలి' అన్నారు.

అందరు నాయకులతో

కృష్ణ సరసన ఆమె 'నంబర్‌వన్, పుట్టింటి గౌరవం, అమ్మదొంగ, జగదేకవీరుడు, మానవుడు-దానవుడు' చిత్రాలలో నటించారు. చిరంజీవితో కలిసి 'రిక్షావోడు, చూడాలని వుంది, అన్నయ్య' చిత్రాల్లోనూ, బాలకృష్ణ సరసన 'టాప్‌హీరో'లోనూ నటించారామె. నాగార్జునతో కలిసి 'హలో బ్రదర్, రాముడొచ్చాడు, ఆజాద్, ఎదురులేని మనిషి, నిన్నే ప్రేమిస్తా' చిత్రాలలో అభినయించారు. వెంకటేష్ సరసన 'సూపర్‌పోలీస్, ఇంట్లో ఇల్లాలు-వంటింట్లో ప్రియురాలు, పవిత్రబంధం, పెళ్ళిచేసుకుందాం, రాజా, జయంమనదేరా, దేవీపుత్రుడు' చిత్రాలలో నాయిక పాత్రను పోషించారు. 'పెదరాయుడు, శ్రీరాములయ్య, పోస్ట్‌మాన్, కొండవీటి సింహాసనం' చిత్రాలలో మోహన్‌బాబు సరసన నటించారు. సౌందర్య తాజాగా 'శివశంకర్' చిత్రంలోనూ నాయిక పాత్రను పోషిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ సరసన 'రాజేంద్రుడు-గజేంద్రుడు, మాయలోడు, మేడమ్' చిత్రాలలోనూ, రాజశేఖర్‌తో కలిసి 'వేటగాడు, మా ఆయన బంగారం, రాజసింహ, సూర్యుడు, రవన్న' చిత్రాలలోనూ సుమన్‌తో 'చిన్నల్లుడు, ఓసి... నా మరదలా' చిత్రాలలోనూ నటించారు. జగపతిబాబుతో కలిసి 'భలేబుల్లోడు, అల్లరి ప్రేమికుడు, దొంగాట, పెళ్ళిపీటలు, మూడుముక్కలాట, నర్తకుపోదాంరండి' చిత్రాలలో అభినయించారు. శ్రీకాంత్ సరసన 'ప్రేమాయణం, తారకరాముడు, నిన్నే ప్రేమిస్తా, నీకే మనసిస్తా' చిత్రాలలోనూ, చక్రవర్తితోకలిసి 'ప్రేమకు వేళాయెరా, ప్రేమకు స్వాగతం', సాయికుమార్‌తో 'అంతఃపురం, ఈశ్వర్‌అల్లా' చిత్రాలలోనూ, అర్జున్‌తో 'శుభవార్త, శ్రీమంజునాథ'లోనూ ఆమె నటించారు. రజనీకాంత్ సరసన 'నరసింహ, అరుణాచలం' చిత్రాల్లోనూ, కమల్‌హాసన్‌తో 'లవ్వండి... నవ్వండి...' చిత్రంలోనూ ఆమె అభినయించారు. అబ్బాస్‌తో కలిసి 'అనగనగా ఓ అమ్మాయి, శ్వేతనాగు'లోనూ, నవీన్‌తో 'తాంబూలాలు'లోను, వినీత్‌తో 'ఆరోప్రాణం'లోనూ, హరికృష్ణతో 'సీతయ్య'లోనూ, హరీష్‌తో 'మనవరాలి పెళ్ళి'లోనూ, శశికుమార్‌తో 'మా ఇంటి ఆడపడుచు'లోనూ ఆమె నాయిక పాత్రను పోషించారు.

చాలా తక్కువగా, చిన్న హీరోల పక్కన ఇలాటి పాత్రలు వేశారు. ఇలాటి వాతావరణంలో సౌందర్య పదేళ్ళకు పైబడి నాయికగా వుండడం, వందకు పైగా సినిమాలు పూర్తి చేసుకోవడం ఆశ్చర్యం గొలిపేంత అరుదైన రికార్డు. ఆమె పట్ల గల జనాదరణకు, అభిమానానికి సంకేతం.

సభ్యతకే పెద్దపీట

తొలిచిత్రం రైతుభారతం షూటింగులోనే సౌందర్య స్వభావం వెల్లడైంది. ఆ షూటింగు ప్రారంభం రోజున భానుచందర్‌తో శృంగార సన్నివేశంలో చేయడానికి ఆమె ఏడుపు మొదలెట్టింది. ఇక గత్యంతరం లేక దాన్ని మార్చి రైతులకు సంబంధించిన పాటను తొలి షాట్‌గా తీశారు.

పరిణితి, పసితనం..

సౌందర్య ఏకకాలంలో పరిణిత పాత్రలను, పసితనాన్నికూడా ప్రదర్శించడంలో విజయం సాధించింది. అమాయకురాలుగానూ ధీరగంభీరగానూ కూడా మెప్పించారు. శ్రీకాంత్, అబ్బాస్, నవీన్‌లాటి యువ హీరోల సరసన టీనేజి తరహా పాత్రలు వేస్తూనే పవిత్రబంధం లాటి సంఘర్షణాత్మక గృహిణి పాత్రలు వేసింది. రిక్షావోడులాటి మాస్ పాత్రలు వేస్తూనే తొమ్మిది నెలలులాటి సంక్లిష్ట పాత్రలకు ప్రాణం పోసింది. మా ఆయన బంగారం, పెళ్ళిచేసుకుందాం రా, అమ్మోరు, పెదరాయుడు, దొంగాట వంటి సినిమాలు ఆమె నటనలో వైవిధ్యాన్ని చూపిస్తాయి. ఎదురులేని మనిషి, మనసిస్తారా చిత్రాల్లో నెగిటివ్ పాత్రలు కూడా ఆమె విభిన్నమైన అభిరుచికి అద్దం పడతాయి. పాటలలో డాన్సు కూడా అవలీలగా చేసేవారు. ఎంతో గంభీరమైన పాత్రలను పోషించిన సౌందర్య సరదా సన్నివేశాలు అవలీలగా నటించి నవ్వులు కురిపించేవారు. నిజానికి ఆమె సినిమాలలో చాలా భాగం మొదట సరదాగా కంగారుగా వుండేవే. అన్నింటినీ మించి షూటింగులలో సర్దుబాటు ధోరణి ప్రదర్శించడం, అందరితో కలుపుగోలుగా వివాదాలకు దూరంగా వుండటం ఆమె పట్ల సద్భావన పెంచాయి. అందుకే ఆమె మృతిపట్ల యావత్ చిత్ర పరిశ్రమ శోకసంతప్తమైంది. ప్రతివారి నుంచీ ఆమె స్నేహశీలతను, సౌజన్యాన్ని హర్షించే మాటలే వినవచ్చాయి. ఆమెకు సెంటిమెంట్లు కూడా ఎక్కువేనట. మనవరాలి పెళ్లి షూటింగ్‌కోసం వచ్చినపుడు దిగిన గదిలోనే చివరి వరకూ దిగేవారు. అందరూ షూటింగు ప్రారంభాలు హంగామా చేసి ముగింపు మాత్రం చడీచప్పుడు లేకుండా పూర్తి చేస్తుంటే సౌందర్య అందుకు భిన్నంగా ముగింపులోనూ వేడుకగా చేసి పనివారికి పైసలిచ్చేవారు.

సాధారణంగా సినిమాల్లో స్త్రీ పాత్రలే ఎక్కువ క్లిష్టంగా వుంటాయి. హీరోలకన్నా హీరోయిన్లకే వైవిధ్యం పోషించే అవకాశం ఎక్కువగా వుంటుంది. కాకపోతే వారు సమర్థులై వుండాలి. ఇందాక చెప్పుకున్న నటీమణులు ఆ కోవకు చెందినవారే. వారు సత్తాలేనివారైతే నాయికలను వట్టి బొమ్మలుగా మలుస్తారు. కేవలం ఎక్స్‌పోజింగ్‌కు, డ్యూయెట్స్‌కు పరిమితం చేస్తారు. సౌందర్య వంటి తారలు లేకపోతే బలమైన స్త్రీ పాత్రలను వూహించడం కష్టం.

జమున వంటి వారు మినహా వివాహమయ్యాక తారల అవకాశాలు తగ్గిపోవడం కద్దు. సౌందర్య ఈ సమస్యను కూడా అధిగమించింది. కొంత గ్యాప్ వచ్చినా మళ్ళీ నిలదొక్కుకోగలిగింది. సీతయ్యలో హరికృష్ణతో చేసినా మామూలు రేంజ్ నిలుపుకోగలిగింది.

అన్నయ్య కారణంగా చిన్నప్పుడే ఆరెస్సెస్‌తో పరిచయం వున్న సౌందర్యకు స్త్రీల గురించి గౌరవ భావం వుంది. కాని అందులో ప్రాచీన ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. "నేను ఫెమినిస్టును కాదు. కాని స్త్రీ పురుషులు సమానులనే నా విశ్వాసం. ప్రాచీన భారతీయ సాహిత్యం, కళలలో ప్రకృతిని స్త్రీతో పోల్చడం నాకెంతో నచ్చుతుంది. అర్ధనారీశ్వరంలోనూ ఈ భావన వుంది. స్త్రీలకు రిజర్వేషన్ కావాలని అడగడమెందుకు? మన సంస్కృతిలో అది ఎప్పుడూ భాగంగా వుంది. ద్వీపలో ఎప్పుడూ తలవంచని స్త్రీ పాత్ర, ఆనకట్ట కారణంగా నిరాశ్రయమవుతున్నా లొంగిపోకుండా పోరాడే ఆమె చెరగని స్థైర్యం చూశాకే ఆ సినిమా నిర్మించాను. తెలుగులో కూడా అలాటి ఒక ఆఫ్‌బీట్ సినిమా తీస్తున్నాను.." అని ఆమె అన్నారు. ఆమెకు హాలీవుడ్‌లో కూడా సినిమా తీయాలని, దర్శకత్వం వహించాలని, సినిమాటోగ్రఫీ చేయాలని కోరికగా వుండేదట. చివరకు అవి తీరనికోరికలే అయ్యాయి. ★

కమలి పేరు మార్చాలన్న సౌందర్య

"పిల్లల దత్తత, తద్వారా లంబాడీ స్త్రీల మనోవేదనను మేము ఇతివృత్తంగా తీసుకున్నాము. సంగీతం సిద్ధమైంది. సౌందర్య స్క్రిప్టు రిహార్సల్ చేయడం కూడా ప్రారంభించింది. కాని ఆమె బిజెపి తరఫున ప్రచారం చేపట్టడంతో చిత్ర ప్రారంభాన్ని మే 24 కు వాయిదా వేయవలసి వచ్చింది. నిజానికి ఆమెకు పెద్దగా ఆసక్తి లేకపోయినా రాజకీయాలలో ప్రవేశపెట్టారు. ఆమెకు ఈ సినిమా కథాంశం ఎంతగానో నచ్చింది. కమలి అనే పేరు మార్చాలని కూడా సూచించారు. తను ప్రచారం చేసే పార్టీ పేరు, సినిమా పేరు ఒకటైతే జనం మరోలా అనుకోవచ్చని ఆమె భావించారు" అని కమలి దర్శకుడు కెఎన్‌టి శాస్త్రి చెప్పారు.

కరెంటు తీగలు

వెంకట సుబ్బారావు కావూరి

"పట్టుకోండి...పట్టుకోండి"
"దొంగలు....దొంగలు"
"వేసేయండి నాయాళ్ళని"

కేకలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.

నిశిరాత్రి వాళ్ళ అరుపులు అక్కడ ప్రతిధ్వనించాయి.

ఒకరి వెంట మరొకరు.

బిల బిలమంటూ గుంపులు, గుంపులుగా

వెన్నెల వెలుగులో పొలాలకు అడ్డంగా పడి రైతులు పరుగులు తీశారు.

గట్ల వెంట పడుతూ లేస్తూ రైతు మహిళలు లగెత్తారు.

కొడవళ్ళు చేత పట్టి కసితో కాళ్ళకు పని పెట్టారు.

కర్ర, బరిశె ఏది దొరికితే దాన్ని తీసుకుని అక్కడకు చేరుకున్నారు.

ఊళ్ళో జనం పెట్టిన తొలి కేక విన్న కొండయ్య ఉలిక్కిపడ్డాడు.

రెండో కేక విన్న తరువాత గానీ అతనికి అర్థం కాలేదు. "అమ్మో ఎవరో చూశారు" అనుకున్నాడు. వణుకు పుట్టింది. కేకలు దగ్గరగా విన్పించేకొద్దీ భయం నిలువెల్లా ఆవరించింది.

" ఒరే రావడూ దూకు." అన్నాడు. మాట బయటకు రాలేదు.

" ఒరే రావడూ" ఈసారి మళ్ళీ గొంతు చించుకు అరిచినా ఎండిన గొంతుక పెగల్లేదు.

అయితే ప్రమాదాన్ని రావడూ పసిగట్టి కరెంటు స్తంభం చివర నుంచి ఒక్కసారిగా దూకాడు.

దూకీ దూకక ముందే చావు భయంతో రావడు పరుగు లంకించుకున్నాడు.

కొండయ్య అతని వెంటబడి రెండు అంగలు వేశాడో లేదో .... బరిశె వెనక నుంచి రివ్వున దూసుకు వచ్చింది. వెన్నులో నుంచి దిగి పొట్టలో నుంచి పేగులతో సహా బయటకు వచ్చింది.

"చచ్చానురో దేవుడో" అక్కడే కూలబడ్డాడు కొండయ్య.

అంతలోనే కొడవళ్ళ పోట్లు. కర్ర దెబ్బలు. గొడ్డలి దెబ్బలు.

ఒకదాని వెంట మరొకటి. కసిదీరా... అక్కడ ఉందెవరో చూడలేదు. కసి...కసి ...ఒకటే కసి.

తమ బతుకుల్ని శాసించే కరెంటు తీగను దొంగిలించేవాడు బతకటానికి లేదు. తాము బతకాలంటే తీగ దొంగ చావాల్సిందే. తర్వాత ఏమి జరుగుతుందన్న ఆలోచన కూడా లేదెవరికీ. తమను అష్టకష్టాలపాలు చేస్తోన్న కరెంటు తీగ దొంగ చేతికి చిక్కాక ఇక వదలటం అంటే కోరి కష్టాలు తెచ్చుకోవటమే. అదే ఆ రైతులను హంతకులను చేసింది.

మొదటి బరిశె దెబ్బకే స్పృహ కోల్పోయిన కొండయ్య కంఠాన్ని పదునైన కొడవలి దెబ్బ మొండాన్నుంచి వేరు చేయగానే ప్రాణం పోయింది.

అతని కట్టె నిర్జీవమయిందని అనుకున్నాక గానీ ఆ రైతుల కసి చల్లార లేదు.

కరెంటు స్తంభం నుంచి దూకి పరుగు లంకించుకున్న రావడు వెంట కొందరు పడ్డారు. అతడి అనుభవం, ప్రాణభయం ముందు రైతుల పరుగు పనికిరాలేదు.

బరిసెలు విసిరారు. గురి చూసి గొడ్డళ్ళూ వేశారు. దొరికిన రాళ్ళను చేతబుచ్చుకుని కొందీరా కొట్టారు. కొన్ని తగిలాయి. మరి కొన్ని ముందే నేల రాలాయి.

అంతలోనే రావదు కాలికి ఏదో ఎదురు తగిలింది. తూలిపడ్డాడు. పడినవాడు లేచేసరికి వెనక పరుగెత్తుతున్నవారిలో ఒకడు ముందుకు ఉరికి గొడ్డలి విసిరాడు. అది విసురుగా వచ్చి చేతి జబ్బకు నాటింది.

''అమ్మో'' అంటూ తూలిపడబోయి తమాయించుకున్నాడు రావదు. జబ్బలో గుచ్చుకున్న గొడ్డలిని పీకి పడేసి మళ్ళీ పరుగు లంకించుకున్నాడు. చీకట్లో చెట్ల చాటున కనుమరుగయ్యాడు.

కొంత సేపు అతడి కోసం వెదికిన రైతులు వెనుదిరిగారు. ప్రారంభం దగ్గరకు తిరిగి చేరుకున్నారు. అక్కడ హీరో హోండా మోటార్‌సైకిల్ కన్పించింది. ఒకరు గొడ్డలితో ఆయిల్ ట్యాంకరును పగులగొట్టారు. మరొకరు నిప్పుపెట్టారు. ఉవ్వెత్తున లేచిన మంటల్లో మోటారు సైకిల్ మాడి మసయింది.

రైతుల కసి తీరింది.

"కరెంటోళ్ళు ఎప్పటికి తగల బడతారో? ఎప్పుడు మళ్ళీ కరెంటు వచ్చుద్దో" వాపోయాడు రైతు సుబ్బరాయుడు.

"ఉండెహె. ముందీ శవం సంగతి చూడాలి గదా? జగ్గం వెంకట్రాయుడు కసురుకున్నాడు.

"నిజమే...నిజమే" అన్నారంతా. అందరూ అక్కడే చతికిల పడ్డారు.

"ఒక పని చేద్దాం ఎవ్వరికీ ఏమీ తెలియనట్టే ఉందాం. కరెంటోళ్ళు బాగుచేయటానికెటూ వస్తారు గదా. అప్పుడు వాళ్ళు చూసుకుంటారు. తీగ దొంగతనం చేయబోయి షాక్ కొట్టి చచ్చుంటాడని వాళ్ళే చెబుతారు. అప్పుడు పోలీసులకు తెలిసినా మనకేం కాదు" వెంకట్రాయుడు చెప్పగా అందరూ అంగీకరించారు.

తాళ్ళూరు ఆఫీసుకు పోయి కరెంటాగిపోయిన విషయాన్ని చెప్పి వచ్చేందుకు ఇద్దరిని పురమాయించి అందరూ లేచి ఇళ్ళకు బయలు దేరారు.

* * *

యాభై ఎకరాల ఆసామి కొండయ్య.

మద్రిపూడి మండలం గంగపాలెం. పొదిలి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి తప్పాడు. అందులోనూ ఒకటీ అరా సబ్జెక్టులు కాదు. ఫస్టియర్ సబ్జక్టులు మూడు మిగిలే ఉండగా, సెకండియర్లో నాలుగు పరీక్షలు పోయాయి. మళ్ళీ పరీక్షలు రాయాల్సిన సమయంలో కొండయ్య తండ్రి చనిపోయాడు.

"ఇక చదువులొద్దూ, చట్టు బండలొద్దు. ఎగసాయమేదో సూసుకో." అని తన బావ కర్మకాండల్ని నిర్వహించటానికి కాకర్ల నుంచి వచ్చిన కొండయ్య మేనమామ. పెద్ద కొండయ్య సలహా ఇస్తున్నట్లుగా ఆదేశించాడు.

దీంతో కొండయ్యకు వ్యవసాయంలోకి దిగక తప్పింది కాదు.

అప్పటిదాకా జొన్న, రాగి, కంది, ఆముదం వేసే సాంప్రదాయం కొండయ్యకు నచ్చలేదు.

"జొన్న పంటతో ఏమొచ్చిద్ది ఎన్నాళ్ళు పోయినా, బత్తాయి తోటలు బాగానే ఉన్నాయంటున్నారుగా అందరూ, నువ్వూ ఎయ్యరాదూ" సలహా ఇచ్చాడు పొదిలిలో ఉండే కొండయ్య స్నేహితుడు చందు. చందు కూడా ఇంటర్ తప్పి తన తండ్రి హోల్‌సేల్ పండ్ల వ్యాపారంలో సాయం చేస్తున్నాడు.

తమకు బత్తాయిలు సరఫరా చేసే ఒకరిద్దరు రైతుల జీవితాలను ఊరించి ఊరించి మరీ చెప్పాడు.

వాళ్ళూ మద్రిపూడి మండలానికి చెందిన రైతులే కావటంతో కొండయ్యలో ఆశ పుట్టింది.

''ట్రాక్టర్లో కాయలేసుకొచ్చి, డబ్బు తీసుకుంటారో లేదోరా, ముందు బాలకృష్ణ సినిమాకో, చిరంజీవి సినిమాకో వెళ్తారు. తర్వాత జూడు రమ్య హోటల్లో దూరి బిర్యానీ తింటూ, మందు కొడతారు. ఇక జూస్కో కొత్తూరెళ్ళి కొంపలో దూరి మజా చేస్తారు. ఏమనుకుంటన్నావురా అట్ట జేస్తారు రోజూ.... కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పాడు చందు.

సినిమా చూస్తుండగా చందు చెప్పిన ఆ మాటలతో కొండయ్య ఒక నిర్ణయానికి వచ్చాడు.

తర్వాత రెండు రోజుల్లోనే ఆచరణ మొదలయింది.

* * *

దార్లో చేను అయితే బత్తాయి తోటకు మంచిదని ఊళ్ళో అప్పటికే తోటలు సాగుచేసిన రైతుల్ని అడిగి తేల్చుకున్నాడు కొండయ్య. అది పదెకరాలు. బత్తాయి నాటాలంటే ముందు బోరు వేయించాలి.

తమిళనాడు నుంచి వచ్చి పొదిలిలో మకాం పెట్టిన బోరు డ్రిల్లింగు మిషనోళ్ళ దగ్గరకు చందుని తీసుకువెళ్ళి మాట్లాడాడు. బోరు ఎక్కడ వేయాలో పాయింటు పెట్టించుకుని కబురు చేస్తే వచ్చి పని మొదలు పెడతామని డ్రిల్లింగు యూనిట్ మేనేజరు నల్లకన్ను చెప్పాడు. అడుక్కి 40 రూపాయలు అవుద్దన్నాడు. రాజుపాలెంలో వేసిన బోర్లలో మూడొందల అడుగుల్లో నీళ్ళు పడ్డాయని కూడా నల్లకన్ను చెప్పాడు. పదెకరాల్లో రెండు బోర్లు వేస్తే తోటకు నీళ్ళు సరిపోతాయని అనుకున్నారు.

పొదిలి రామాలయం వీధిలో కార్యాలయం ఉన్న జియాలజిస్టు లింగయ్య దగ్గరకు కొండయ్యను చందు తీసుకుపోయాడు. లింగయ్యది రాజుపాలెం. ఇంటర్ చదివి ఆ పైన పేదరికం వలన చదువు కొనసాగించలేక పొదిలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కాంపౌండరుగా నాలుగేళ్ళు పనిచేశాడు. నెలకు ఐదొందల జీతం. రోగుల్నించి పీక్కుతింటేనే పైన మరికొంత వచ్చేది. అంతా కలిపినా భార్యా బిడ్డల తిండికి కూడా చాలేది కాదు. ఆసుపత్రి మందుల్ని కాజేసి బయటి దుకాణంలో అమ్మటం ప్రారంభించాడు. దొంగతనం కొన్నాళ్ళకు డాక్టరు కంట పడింది. దీంతో డాక్టరు చేతిలో దెబ్బలు తిని మరీ బయటకు రావాల్సి వచ్చింది లింగయ్యకు. అనంతరం కొత్తగా ఆఫీసు పెట్టిన జియాలజిస్టు శ్యాం దగ్గర చేరాడు. లింగయ్యను శ్యాం బాగానే ఆదుకున్నాడు. పని మాత్రం అంతగా వంటబట్టలేదు. రెండు సంవత్సరాలు అలా గడిపిన అనంతరం లింగయ్యలో అసలు మనిషి మేలుకున్నాడు. శ్యాం లేనప్పుడు బోరు పాయింట్ల కోసం వచ్చే రైతులతో తానే జియాలజిస్టునని చెప్పుకుని డబ్బు గుంజటం ప్రారంభించాడు. ఏదో పేరున సెలవు పెట్టి శ్యాంకు తెలియకుండా పనులు పూర్తి చేసేవాడు. అరకొర జ్ఞానంతోనే బోరు పాయింట్లు గుర్తు పెట్టేవాడు. గుడ్డేటు సామెతగా కొందరు రైతులకు జల బాగా పడేది. దీంతో లింగయ్య పేరు రైతుల్లో ప్రచారం అయింది. అదే సమయంలో లింగయ్య లాంటి నకిలీ జియాలజిస్టులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. ఇంటర్మీడియట్ నుంచి ఎమ్మెస్సీ వరకూ ఏడేళ్లపాటు కష్టపడి జియాలజీ చదివిన శ్యాంలాంటి వారు లింగయ్య మాదిరిగా ఒట్టొట్టి మాటలు చెప్పలేక వెనక పట్టుపట్టారు. ఖర్చులు కూడా రాకపోవటంతో శ్యాం తన కార్యాలయాన్ని లింగయ్యకు అప్పగించి హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇక లింగయ్య రైతుల నుంచి ఒకటే రొల్లుకోవటం ప్రారంభించాడు.

"పాయింటుకు మూడొందలు ఇవ్వాలి" లింగయ్య చెప్పాడు. కొండయ్య సరేనన్నాడు.

తీరా రెండు బోర్లు వేయాల్సి ఉంటే ఆరు పాయింట్లలో తవ్వితేగానీ ఆశించినంత జల పడలేదు.

లింగయ్యకు ఏమీ తెలియదని తెలుస్తూనే ఉన్నా అతని మాటలు, చేతలు కొండయ్యను నోరు మెదపనీయలేదు.

లింగయ్య వచ్చేటప్పుడు తెచ్చుకున్న విస్కీని చందు, కొండయ్యలకు కూడా రెండు రాత్రులూ పూటుగా పోశాడు. దీంతో వారి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ కారణంగా ఆరు పాయింట్లకుగాను చచ్చినట్లు 1800 రూపాయలు అతని చేతిలో పెట్టాడు.

ఏదో ఒక రకంగా రెండు బోర్లు వేయటం పూర్తయింది. ఇక కరెంటు కనెక్షను తీసుకోవడం ఒక్కటే మిగిలింది. అదే పెద్ద సమస్య అని తోటోళ్లందరూ చెప్పారు.

అయితే కొండయ్య మద్రిపూడి పోయి ఏఇని కలిస్తే అబ్బే అదేం పెద్ద సమస్య చిటికెలో కనెక్షను ఇప్పించనూ అని చప్పరించాడు.

ఎంతవుతుందో లెక్కలు వేసి చెప్పాడు. ముందు తనకు రూ. 10 వేలు లంచం ఇస్తే అధికారులకు కూడా ముట్టజెప్పి మూడోనాటి కల్లా కనెక్షను ఇస్తానని చెప్పాడు.

సరేనని తీరా డిడిలు అవీ కట్టిన తర్వాత కొసగా పేచీ పెట్టాడు. కరెంటు తీగ మాత్రం సొంతంగా తెచ్చుకోవాలని చెప్పాడు. దానికీ తాను మార్గం చూపుతానని మాట ఇచ్చాడు. తాళ్ళూరు మండలం లంకోజిపల్లి దగ్గరకు పోయి కరెంటు తీగను దొంగతనంగా తెచ్చుకోవచ్చుని చెప్పాడు. ఆ మండలం ఏఇ తన ఫ్రెండే అయినందున ఏమీ ఇబ్బంది రాదని నమ్మబలికాడు. దానికి గాను ఆ ఏఇకి రూ. 10 వేలు ఇవ్వాలని చెప్పి అక్కడికక్కడే

(మిగతా 15వ పేజీలో)

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

నవ్వాలా ఏడ్వాలా!



చాలా రోజుల తర్వాత మాలతి వచ్చింది. దాని ముఖం మీద ఏవో విచార రేఖలు. నొసలు ముడతలు పడి వుంది.

"ఏమైందే అట్లా వున్నావు?" అడిగాను ఆత్రంగా.

"అబ్బ! అంత సీరియస్ ఏం లేదే! నా కొడుకు అనిల్ ఇంజనీరింగులో చేరాడు-"

"మంచిదే కద! విచారమెందుకే దానికి" అన్నాన్నేను ఆనందంగా ఊపిరి వదులుతూ.

"అది సరేనే! సంవత్సరానికో మ్యూజిక్ సిస్టమ్ కావాలంటాడు. దాంతో వచ్చింది పరేషానీ!"

మాలతి ముఖంలో మళ్ళా విచార రేఖలు కన్పించాయి.

"దాంతో ఇంత పరేషానీ ఎందుకే?".. నా సందేహం.

"పరేషానీ కాక ఏందే! టెన్త్‌లో వున్నప్పుడు వాక్‌మాన్ కావాలని కొనుక్కున్నాడు. వాక్‌మాన్ ఎందుకురా! టెన్త్‌లో వున్నావు. చదువు సాగదు. అది చెవిలో పెట్టుకొని పాటలు వింటుంటే చదువెక్కడ సాగుతుంది. ఎప్పుడైనా వినాలనిపిస్తే టూ ఇన్‌వన్ వుంది కద వినమని అన్నాను. వినలేదు. మంకుపట్టు పట్టాడు. అంతకుముందే పెద్దటేప్‌రికార్డ్ ప్లేయర్ వుంటే అది చెడిపోయింది. దాన్నెవ్వరూ బాగుచేసే వాళ్ళు లేరు. అంతేకాదు దాని టేప్‌లు ఇప్పుడు దొరకడం లేదు అని మా వారు టూ ఇన్ వన్ పెద్దదే కొన్నారు. మళ్లీ బుల్లి టూ ఇన్‌వన్‌లు వచ్చాయి. పెద్ద టూ ఇన్‌వన్ వద్దని, చిన్నదైతే చేతిలో పెట్టుకొని తిరగవచ్చు అని అనిల్ బుల్లి టూ ఇన్‌వన్ కొన్నాడు. బుల్లి టూ ఇన్ వన్ బాగా లేదని, వాక్‌మాన్ కావాలని అన్నాడు.."

"అంటే వాక్‌మాన్ అయితే ఇతరులకు డిస్టర్బెన్స్ లేకుండా వినొచ్చు. అదీగాక చదువుకుంటూ, రాసుకుంటూ పని చేసుకుంటూ బ్యాక్‌గ్రౌండ్ సంగీతం లాగా వినొచ్చు అనుకున్నాడేమో..." అన్నాన్నేను మధ్యలో కల్పించుకొని.

"సరే! అది అయినంక ఇంటర్‌లో వున్నప్పుడు ఒకటి కాదు రెండు కాదు పది వేల రూపాయలు పెట్టి పెద్ద మ్యూజిక్ సిస్టమ్ అంటూ కొన్నాడు. దాని సౌండు నాకూ బాగానే అనిపించింది. సరే! బాగుందిలే. సంగీతం చాలా బాగా మధురంగా నిండుగా వినవచ్చును అనుకున్నాను. ఇంతలో ఇంటర్ సెకండ్ ఇయర్‌లోకి వచ్చేసరికి టేప్‌లను మాత్రమే వినిపిస్తుంది. సీడీలు దాని మీద ఆడవు. సీడీలో సంగీతం వినటానికి చాలా బాగుంటుంది. సౌండు చాలా గంభీరంగా బాగుంటుంది అని మొదలుపెట్టాడు. మళ్ళా ఇరవై వేలు పెట్టి సీడీలు ఆడే మ్యూజిక్ సిస్టమ్ కొన్నాడు..."

"సరే! ఇప్పుడు దాంతో ముడిపడిందా లేదా?" అడిగాన్నేను.

"అట్లా ముడిపడితే ఈ విచారమెందుకు! ఇప్పుడు కొత్తగా డీవీడీలు వచ్చాయంటున్నాడు. సీడీల కన్నా డీవీడీలు స్పష్టంగా వుంటాయి. అది కొంటానంటున్నాడు. డీవీడీ అంటే డిజిటల్ వీడియో డిస్క్ అట. డిజిటల్ కాబట్టి ఆ వీడియోలు చాలా స్పష్టంగా బాగుంటాయంటాడు. ఇట్లా మాటిమాటికి మారే యంత్రాలకు డబ్బు కుమ్మరించాలంటే ఎక్కడ్నుంచి వస్తుంది చెప్పు సుశీ!" అంది మాలతి బాధగా.

"టెక్నాలజీ అభివృద్ధి చెంది ఎప్పటికప్పుడు కొత్త పరికరాలు, ఇంకా బాగా పని చేసే పరికరాలు మార్కెట్లోకి వస్తున్నాయి. మంచి వస్తువును వెంటనే కొనేయాలని యువత ఉర్రూతలూగుతుంటారు. ఇది సాంకేతిక యుగం! సాంకేతిక యుగంలో నిత్యనూతనమైన వస్తువును సొంతం చేసుకోవాలనే ఉబలాటంలో వుంటున్నారు యువత. వాళ్ళ ఉబలాటాలకు తగ్గట్టుగానే కొత్త కొత్త వస్తువులు సృష్టింపబడుతున్నాయి. అదే కద! - కన్‌జ్యూమరిజం! వస్తు ప్రపంచం సృష్టిస్తున్న మాయ!" అన్నాన్నేను. నా మాటలతో మాలతికి ఊరట కలిగినట్లు లేదు. దాని ముఖం మీద విచార రేఖలు మలిగిపోలేదు. ఇంకా. దాని విచారాన్ని, బాధను పోగొట్టే మాటలుగాని ఉపాయాలు గాని నా దగ్గర ఏవీ లేవు. నిస్సహాయంగా నేనూ నిట్టూర్చాను. సాంకేతికంగా జరిగే ప్రగతికి సంతోషించాలో, విచారించాలో అర్థం కాలేదు నాకు. ★

దానిమ్మ పండు

కె.సాహిల్

(గత వారం తరువాయి)

పసుపుపచ్చ కుక్క చనిపోవడం చూసి చిన్నవాడు ఎంతో విచారించాడు. ఒక గుంట తవ్వి కుక్కను పూడ్చిపెట్టాడు. అంతేకాదు... ఆ సమాధిమీద ఒక దానిమ్మ మొక్కను నాటాడు. ప్రతిరోజూ అక్కడికి వచ్చి చెట్టుకి నీళ్లపోసేవాడు. అంతేకాదు మొక్క చుట్టూ బాగు చేసేవాడు. పిచ్చిమొక్కలేవైనా వస్తే పెరికి పారేసేవాడు. పురుగులేమైనా కనిపిస్తే ఏరిపారేసేవాడు. దానిమ్మ చెట్టు చాలా త్వరగా పెరిగి పెద్దయ్యింది. అంతేకాదు. దానికి కాయలు కూడా వచ్చాయి.

ఓరోజు రాలి నేలమీద పడిన దానిమ్మపండును చూశాడు చిన్నవాడు. పరుగెత్తుకుంటూ వెళ్లి దాన్ని తీసుకున్నాడు. అది మెల్లగా రెండుగా చీలింది. అంతేకాదు. చాలా చాలా పెద్దగా అయ్యింది. బాగా బరువుగా వుండడంతో చిన్నవాడు దానిమ్మపండును మెల్లగా నేలమీద పెట్టాడు. అంతే వెంటనే ఒక అద్భుతం జరిగింది.

దానిమ్మపండు చాలా అందమైన ఇల్లుగా మారిపోయిందు. ఎంటు ఇంట్లోకి వెళ్లిచూశాడు. లోపల వున్న వస్తువులు, ఆహారపదార్థాలు చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. వెంటనే ఈ శుభవార్తను తన అన్నయ్యతో చెప్పాడు. 'అన్నయ్యా! అన్నయ్యా!! నేను నా దానిమ్మ పళ్లను ఇళ్లు లేని వాళ్లకు ఇస్తాను. ఇది మంచి పనే కదూ' అన్నాడు.

వెంటనే పెద్దవాడికి కోపం వచ్చింది. పెద్ద గొంతుతో 'మన సంపదను ఇతరులకు ఎందుకు ఇవ్వాలి? మనం మాత్రమే సంతోషంగా వుందాం!' అన్నాడు.

అప్పుడు చిన్నవాడు 'అదికాదు అన్నయ్యా! ఆ దానిమ్మపళ్లను పేదవాళ్లకు ఇస్తే ఇంకా మంచిగా బతుకుతారుకదా?' అన్నాడు. పెద్దవాడికి ఇది ఇష్టంలేదు. కాని చిన్నవాడు తను చెప్పినట్టు చెయ్యడు. అందుకని వాడు ఒక ఉపాయం ఆలోచించాడు.

వాడు ఆ రోజు అర్ధరాత్రి మెల్లగా దానిమ్మ చెట్టు దగ్గరకు వెళ్లాడు. మెల్లగా చెట్టుపైకి ఎక్కి పళ్లన్నీ కోసి ఒక గోతాంలో వేశాడు. ఇంటికి వచ్చాక దాన్ని తెరిచి నేలమీద పోశాడు. అంతేకాదు సంతోషంగా తను ఈ సారి లక్షాధికారి అవడం ఖాయం అనుకున్నాడు.

దీపపు వెలుగులో అన్నిటిలోకి పెద్ద దానిమ్మపండును ఏరాడు. దాన్ని రెండు చేతులతో పట్టుకున్నాడు. పండు మెల్లగా తెరచుకుంది. అందులోంచి ఒక జోరీగ బయటకు వచ్చింది. అంతేకాదు. దాని తర్వాత బోలెడన్ని జోరీగలు వచ్చాయి. అవి అతగాడి మొహం చుట్టూ జుయ్యిమని తిరిగి కుట్టి గాయపరిచాయి. దాంతో వాడి మొహం మంట పుట్టింది.

బాధగా చేత్తో తడుముకుంటూ... 'ఇది మంచి దానిమ్మపండుకాదు. చాలా చెడ్డది. ఆ రెండో పెద్ద దానిమ్మపండులో అందమైన ఇల్లు వుండివుంటుంది' అనుకుని దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. మెల్లగా అది తెరచుకుంది. అందమైన ఇంటికి బదులుగా ఒక కోడిపుంజు ఎగురుకుంటూ బయటపడింది. పెద్దగా అరచింది. వాడిమీదకు ఎగిరింది. ముక్కుతో పొడిచి వెళ్లిపోయింది. నొప్పితో అల్లాడిపోయాడు. 'ఇదికూడా చెడ్డ దానిమ్మ పండే. ఆ మూడో పెద్ద దానిమ్మపండులో అందమైన ఇల్లు వుండి వుంటుంది' అనుకున్నాడు. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

అది కూడా మెల్లగా తెరచుకుంది. పసుపుపచ్చ కుక్క బయటకు వచ్చింది. అది పెద్దవాడిని చూచి అరిచింది. వాడు దాన్ని జాగ్రత్తగా గమనించాడు. అది ఆ కుక్కే. చచ్చిపోయేం వరకు తను దున్నించిన కుక్కే ఇది. దాంతో వాడు భయపడి మూర్ఛపోయాడు.

తెలివి వచ్చి చూసేసరికి వాడికి ఒక్క దానిమ్మపండుకూడా కనపడలేదు. అప్పుడు వాడికి బుద్ధి వచ్చింది. 'అమాయకుడు, మంచివాడు, చిన్నవాడు అయిన తమ్ముడికి అన్యాయం చేసినందుకు నాకు మంచి శాస్తి జరిగింది' అనుకున్నాడు మనసులో.

(అయిపోయింది)



చిన్నారి చిత్రకారులు



జి.అంజలి, 8వ తరగతి, ఎస్ఎఆర్ క్యాంప్.

జె.భార్గవిశ్రీ,
7వ తరగతి,
న్యూ లిల్లీ మోడల్
హైస్కూల్,
లాలాగూడ,
హైదరాబాదు.



సిహెచ్.యశస్విని, 1వతరగతి,
శ్రీ సత్యసాయి విద్యా విహార్ హైస్కూల్,
అంబర్‌పేట్, హైదరాబాద్.



ఎ.సంతోష్,
4వ తరగతి,
ఆంధ్రా పబ్లిక్ స్కూల్,
గణపర్తి,
విశాఖపట్నం.

డి.మనోహరి,
9వతరగతి,
నారినేపాడు,
కృష్ణాజిల్లా.



యెలగందుల
గణేష్,
10వతరగతి,
జడ్‌పిహెచ్ఎస్,
ఆత్మకూర్.

ఎన్ని ముఖాలు వున్నాయి?

హాయ్ నేస్తాలూ! పైన చాలా చాలా అరుదైన బొమ్మ ఒకటి వుం
అందులో మీకు ఏమి కనిపిస్తోందో చెప్పాలి? అబ్బో అందులో కష్ట
ఏముంది? ఒక గుర్రం, దానిమీద ఓ సైనికుడు' అంటున్నా
చిన్నారులంతా ఏక కంఠంతో. కాని మీరంతా తప్పులో కాలు వేశారు
ఎందుకంటే అక్కడ మీరు చెప్పినవాటితోపాటు చాలా ముఖాలున్నాం
కావాలంటే పరిశీలనగా చూసి చెప్పండి... చూశారా! అయితే అందు
వున్న ముఖాలు ఎన్ని? జవాబుకావాలంటే వారం ఆగాలి.

చుక్కలు కలుపుతారా!



క్విజ్ 5కు జవాబులు

1.విశాఖపట్నం 2.హిమాలయాలలో పుట్టిన నదులను 3.తొమ్మిది 4.స్లాటో 5. నల్లరేగడి నేలలు 6.1591 7.భీంరావు రాంజీ అంబేద్కర్ 8. 21 రోజులు 9. దీర్ఘ చతురస్ర వైశాల్యము 10. హరి కిషన్ సింగ్ సూర్జిత్.

మా బుజ్జి నేస్తాలకు....

హాలో... ఈ వారం 'బాలనేస్తాలు' పేజీ ఎలా వుంది? మీకు నచ్చిందా? చిన్నారి చిత్రకారుల నుంచి చాలా బొమ్మలు వస్తున్నాయి. అందుకని స్థలం పెంచి ఇచ్చాం. చక్కటి బొమ్మలను పంపిస్తే పెద్దవిగా పెడతాం. కాస్త కుదురుగా కూర్చుని వేసి పంపండే. అలాగే 'కలం స్నేహం' ను ఇకనుంచి నెలకు ఒక్కసారి రంగులపేజీలో ఇద్దామనుకుంటున్నాం. రెండవ పేజీలో వచ్చే హ్యాపీ బర్త్‌డే లాగా అన్నమాట. అందుకని మీరు కలం స్నేహంకు రంగు బొమ్మలు పంపిస్తే ఎంచక్కా రంగుల్లోనే ప్రచురిస్తాం. సరేనా. ఇవన్నీ గుర్తు పెట్టుకుని మీరు గీసిన బొమ్మలను, మీ ఫొటోలను మాకు పంపండి.

మా చిరునామా: బాల నేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

చిక్కు ప్రశ్న

హరీష్, మహేష్ సరదాగా ఓ తోటలోకి షికారుకి వెళ్లారు. అక్కడ ఒక జామ చెట్టు నిండా కాయలున్నాయి. కాయలు కోసుకోవాలంటే చెట్టెక్కాలి. హరీష్‌కి చెట్టెక్కడం రాదు. మహేష్ ఎక్కాడు. అయితే ఒక షరతు పెట్టాడు. 'నేను శ్రమపడి చెట్టు ఎక్కుతున్నాను. కాబట్టి కోసిన కాయల్లో నాకు రెండొంతులు. నీకు ఒక వంతు' అన్నాడు మహేష్. హరీష్ ఒప్పుకున్నాడు.

మహేష్ చెట్టెక్కి కాయలు కోశాడు. తరువాత ఒప్పందం ప్రకారమే పంచుకున్నారు. తిరిగి వచ్చేటప్పుడు వారికి ఒక ఏరు అడ్డొచ్చింది. మహేష్‌కి ఈత రాదు. హరీష్‌కి వచ్చు. ఎలాగయితేనేం... హరీష్ మహేష్‌ని ఏరు దాటించాడు. అందుకని వాడు వీడికి ఒక జామకాయ ఇచ్చాడు. అప్పుడు నాల్గిద్దరి దగ్గర వున్న జామకాయలు సమానమే. ఎలాగో చెప్పండి చూద్దాం... తొందరేం లేదు. బాగా ఆలోచించుకోండి. వారం రోజులు సమయం వుందికదా. అప్పటికి తెలీకపోతే .... మేమే చెప్పేస్తాం.

కాకి ఉపాయం

"నక్క మాటలకు కాకి ఎంతగానో ఆనందించింది. స్నేహితుడి వద్ద సెలవు తీసుకుని ఎగిరిపోయింది. మరునాడు ఆ కాకి అడవి పక్కనే వున్న రాజుగారి తోటలోకి వెళ్లింది. ఒక చెట్టు మీద వాలి కూర్చుంది. ఆ తోటలో ఒక కోనేరు వుంది. ఆ సమయంలో రాజుగారి భార్య, చెలికత్తెలు కోనేటిలో స్నానం చేయడానికి వచ్చారు. రాణి నగలను తీసి కోనేటి గట్టు మీద పెట్టింది. అదే అదునుగా భావించిన కాకి రాణిగారి ముత్యాల హారాన్ని ముక్కున కరుచుకుని ఎగిరిపోయింది. ఆ దృశ్యం చూసి చెలికత్తెలు గాబరా పడ్డారు. ఆ కాకిని వెంబడించమని కాపలా భటులకు చెప్పారు.

భటులు ఈటెలు తీసుకొని కాకి వెళ్లిన వైపు పరుగులు తీశారు. కాకి కావాలని నిదానంగా ఎగురుతూ తాను నివసించే చెట్టు దగ్గరకు వెళ్లింది. దాన్నే వెంబడిస్తున్న భటులు కూడా అక్కడకు చేరుకున్నారు. కాకి ముక్కున కరచి పట్టుకు వచ్చిన ముత్యాల హారాన్ని భటులు చూస్తుండగా పుట్టలో పడేసింది.

పుట్టను తవ్వకుండా హారం బయటకు రాదు. కాబట్టి భటులు పుట్టను తవ్వడం ప్రారంభించారు. తన గూటిని ధ్వంసం చేస్తున్న వారిని కాటేయడానికి పాము పైకి వచ్చింది. కోపంతో బుసలు కొడుతూ భటులపై దాడి చేయబోయింది. భటులు ఆ పామును ఈటెలతో కొట్టి చంపారు. హారాన్ని తీసుకొని రాజప్రాసాదానికి వెళ్లిపోయారు.

కరటకా! ఆ విధంగా కాకి తన శత్రువును ఉపాయంతో చంపించి సుఖంగా జీవించింది. ఉపాయంతో ఎలాంటి కార్యమైనా సాధించవచ్చు. బలవంతుని కంటే బుద్ధిమంతుడే గొప్పవాడు. బుద్ధిహీనుడికి ఎంత బలమున్నా దండగే. ఉపాయం గల ఒక కుందేలు తనకన్నా వెయ్యింతలు బలమున్న సింహాన్ని చంపేసింది" అంటూ దమనకుడు ఆ కథ చెప్పసాగాడు.

తిండిపోతు చేప



హాయ్ మీకు ఇవాళ ఓ తిండిపోతు చేప గురించి చెప్దామనుకుంటున్నాం.దాని పేరు ఏంటంటే... పిరన్హస్. ఇది ఎంత పెద్ద జంతువునయినా సరే సులభంగా తినేస్తుంది. దానికి ఎంత పెద్ద బొమికలు వున్నా సరే కరకరా నమిలేస్తుంది. కానీ ఈ చేప వల్ల చాలా ఉపయోగాలున్నాయంటే ఎవరూ నమ్మరు.

ఎంచక్కా ఈ చేపలను అక్వేరియమ్‌లలో పెంచుకుంటారు. అమేజాన్‌లో గిరిజనులు ఈ చేపలను తింటారు. ఎందుకంటే వాటిని పట్టుకోవడం చాలా సులభం. పైగా రుచిగా కూడా వుంటాయి. అంతేకాదు వీటి కింది దవడకున్న పళ్లను పీకి పనిముట్లను పదునుపెట్టడానికి, మెరుగు పరచడానికి ఉపయోగిస్తారు. ఇదంతా చదువుతుంటే 'జై తిండిపోతు మహారాజ్ కీ' అనాలనిపిస్తోందా!

రియల్ స్టోరీ

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

పడగ నీడలో పసితనం

సూర్యుడు అస్తమిస్తున్నాడు. సంధ్య కిరణాలు ఏటవాలుగా నునుపైన కొండల మీద ప్రతిఫలిస్తున్నాయి. ఆకాశంలో తెల్లని మబ్బులపై లేత కిరణాలు జాలువారి అరుణిమను అలుముతున్నాయి. నికోసి జాన్సన్ వంటరిగా కూర్చున్నాడు. ఇంటి బాల్కనీలో కూర్చుని చూస్తుంటే దూరంగా పచ్చిక మైదానాలు భూదేవి చీరకట్టిన చందంగా కనిపిస్తున్నాయి. మరోపక్క చిన్న మైదానం... కేరింతలు కొడుతూ పిల్లలు రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు.

గడిచిన పద్నాలుగేళ్ళు భారంగా దొర్లిపోయాయి.

నిస్సత్తువ... ఏ పనీ చేయలేని అసక్తత... తల్లి నుంచి సంక్రమించి రోజురోజుకూ విషనాగులా ఎదుగుతూ మింగడానికి ఎదురు చూస్తున్న మృత్యువు... నికోసి జాన్సన్ జీవితం పడగ కింద పసితనంగా అయ్యింది.

పక్కనున్న టేబుల్‌పై నున్న మందులలో ఓ రెండు మాత్రలు తీసి నోట్లో వేసుకుని మింగాడు. గొంతులో దిగడానికి రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగాడు.

నోరంతా చేదుమయం అయిపోయింది.

విషం లాంటి ఔషధాలు ఇంకా ఎన్నాళ్ళు మింగాలో తెలియడం లేదు. నికోసికి ఒక్కసారి తల్లి గుర్తుకు వచ్చింది. అప్రయత్నంగా కన్నీళ్ళు చెక్కెళ్ళపై జారి కిందకి ప్రవహించాయి.

నిరంతరం బాధపడుతూ లుంగలు చుట్టుకుపోయిన అమ్మగుర్తుకు వచ్చింది. ప్రతిరోజూ డాక్టర్లు రావడం.. ఏవేవో పరీక్షలు చేయడం.. మందులు మింగించడం తనకు లీలగా గుర్తున్నాయి. ఆ వచ్చిన వాళ్ళందరూ అమ్మనూ తననీ మార్చి మార్చి చూడటం... "అయ్యో! పుట్టుకతోనే ఎంత కష్టం వచ్చిందని" జాలిపడటం అప్పుడు అర్థం కాలేదు.

తల్లి చనిపోయిన తర్వాత తనేమిటో తనకు తెలిసింది. అప్పటి నుంచి కష్టాలను, కన్నీళ్ళను మింగుతూ జీవచ్ఛవంలా బతుకు వెళ్ళదీస్తున్నాడు.

నికోసి జాన్సన్‌కు మరోసారి దుఃఖం తన్నుకొచ్చింది.

"భగవంతుడా! అందరు పిల్లల్లా ఆనందంగా నేను ఎందుకు ఉండలేకపోతున్నాను. ఆటలాడుతూ పాటలు పాడుతూ ఎందుకు గెంతలేకపోతున్నాను. శరీరంలో ఒకో భాగం నుంచి బాధ మొదలై ఎందుకు జీవచ్ఛవంలా బతుకుతున్నాను...." దీనంగా విలపించాడు.

చీకటి గుహలోకి వెళ్ళిపోయే వెలుగుని నిలదీసి అడగాలని అనుకున్నాడు. పాపం... పుణ్యం... ప్రపంచ మార్గం ఏమీ తెలియని నాకు ఏ పాపం చేశానని ఈ శిక్ష విధించావు!" అని కనిపించని భగవంతుడ్ని ఎలుగెత్తి అడగాలని అనుకున్నాడు.

నికోసి మాటలు నోటిలోనే ఉండిపోయాయి.

శరీరాన్ని మెలితిప్పిన బాధ దుప్పటి ముసుగులా కమ్ముకుంది... "అమ్మా!" అన్న పిలుపు చిన్నగా సన్నగా బైటికి వచ్చింది.

చనిపోయిన అమ్మకు ఆ మాట వినిపించదు.

పక్కగదిలో ఉన్న పెంపుడుతల్లి గెయిల్ జాన్సన్‌కు వినిపించింది. బత్తాయిరసం తీసి గ్లాసులో పోసి తాగించడానికి వస్తుండగా వినిపించిన పిలుపు మాతృహృదయాంతరాళాలకు తగిలింది.

"బాబూ!" అంటూ చుట్టుకుపోయింది.

జాలిగా, నీరసంగా దయనీయంగా చూస్తున్న పద్నాలుగేళ్ళ నికోసిని దగ్గరగా తీసుకుంది. ఆప్యాయంగా నుదిటి మీద ముద్దు పెట్టుకుంది. వరండాలో నుంచి నడిపించుకుని బెడ్‌రూంలోకి తీసుకువచ్చింది. ఫ్యాన్ వేసి జ్యూస్ తాగించింది.

కృతజ్ఞత నికోసి కళ్ళల్లో నీళ్ళుగా జాలువారాయి.

* * *

దక్షిణాఫ్రికాలో జోహాన్స్‌బర్గ్.

చిన్నమధ్యతరగతి కుటుంబంలో 1987లో నికోసి జాన్సన్ జన్మించాడు. అతని తల్లి రౌజీగాకు ఉన్న ఎయిడ్స్ ఆమె ద్వారా ఇతనికి సంక్రమించింది. పుట్టుకతో హెచ్.ఐ.వి. పాజిటివ్ రక్తంలో ఉందని గుర్తించిన వైద్యులు విస్తుపోయారు. ప్రత్యేక పర్యవేక్షణలో ఈ బాలుడిని పెంచడానికి ఏర్పాట్లు చేశారు.

నలభై ఏడు లక్షలకు పైగా ఎయిడ్స్ బాధితులున్న దక్షిణాఫ్రికాలో నికోసి జాన్సన్ జీవితం హృదయ విదారకంగా తయారైంది. పుట్టుకతోనే తండ్రి చనిపోవడం... ఊహ తెలిసే నాటికే ఎయిడ్స్ బారిన తల్లి మృత్యువాత పడటం జాన్సన్‌కు ఒంటరితనం దగ్గరైంది.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుడని తెలియడంతో భయంతో ఎవరూ దగ్గరకు చేరదీయలేదు. బంధువులు సంబంధంలేదని తప్పించుకున్నారు. నా అనేవాళ్ళు లేక విలవిల్లాడిపోయాడు.

ఆ సమయంలో గెయిల్ జాన్సన్ అమృత మూర్తిలా ప్రత్యక్షం అయ్యింది. ఎవరికీ అక్కరలేని, ఎవరికీ ఏమీకాని నికోసిని దత్తత తీసుకుంది. 'ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు బతికేది కొద్దికాలం. ఆ కాలంలో అయినా ఆనందాన్ని ఆస్వాదించడానికి అవకాశం కల్పించాలి. తల్లి ప్రేమ తండ్రి ఆప్యాయతలు దూరమైన నికోసిని ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాను–" అని ప్రకటించింది.

ఆమె ప్రేమ, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది.

రోజురోజుకూ మృత్యువు సమీపిస్తోంది. ఎయిడ్స్‌కు మందులేదు.. అయినా జీవితాన్ని పొడిగించడానికి మందులతో తన ప్రయత్నాలను ప్రారంభించింది.

నికోసిని తన ఇంటికి తీసుకువెళ్ళింది.

అతనికి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించింది. సాయంత్రం పూట వరండాలో విహరించడానికి, చిన్నచిన్న ఆటలు ఆడటానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది. అతని తిండికోసం.. మందుల కోసం... బాధలను మరిచిపోయే విధంగా సంరక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. "నా కొడుకైతే ఇవన్నీ చేయనా?... నికోసి నాకు పుట్టకపోయినా నా కొడుకే!" ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని ఆనందించే గెయిల్ ఎంతోమంది మాతృమూర్తులకు ఆదర్శమని ప్రశంసలు పొందింది.

బాధ అంటే ఏమిటో తెలియకుండా ఆ ఇంటిలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది. దక్షిణాఫ్రికాలో

ప్రముఖ గాయకులందర్నీ సంప్రదించి ఆమె గృహానికి రప్పించేది. వేలాది రూపాయలు చేతిలో పడితే తప్ప కాలు కదపని ఎంతోమంది ప్రముఖులు ఆమె ఇంటిలో నికోసి ముందు పాటలు పాడారు. ప్రదర్శనలు ఇచ్చారు. ఒక్కొక్కరు వచ్చి నికోసిని పలకరించి ధైర్యం చెబుతుంటే ఆ బాలుడు పులకరించిపోయాడు. బతికిన కొద్దిరోజులు అయినా ఆశావహ దృక్పథాన్ని అలవరచుకోవాలని ఈ ప్రయత్నాలన్నీ గెయిల్ చేసేది.

ఆమె ప్రయత్నాలకు ఎంతో మంది నుంచి ఆమోదం లభించేది. రోజురోజుకూ మృత్యువును సమీపిస్తున్న నికోసికి ఇ-మెయిల్సు, ఫోన్‌కాల్సు, ఉత్తరాల ద్వారా ఎంతోమంది ఉత్సాహపరిచేవారు. శుభాకాంక్షలతో జేజేలు పలికేవారు.

కనుచూపు మేరలో కనిపిస్తున్న మృత్యువు కోరలు చాస్తూ వస్తున్నప్పటికీ గెయిల్ మాతృప్రేమతో నికోసి జాన్సన్‌ని కట్టిపడేసింది. మమతానురాగాలతో ఆనందాల్లో బందీ చేసింది.

* * *

2001 జూన్ 1వ తేదీ.

అంతర్జాతీయ బాలల దినోత్సవం... ప్రపంచం మొత్తం మీద ఆనందోత్సాహాలతో వేడుకలు జరుగుతున్నాయి.

దక్షిణాఫ్రికాలో జోహాన్స్‌బర్గ్

వెస్టుపార్కు స్మశానంలో నిశ్శబ్దం తాండవిస్తోంది. వేలాదిమంది ప్రముఖులు, మౌనంగా తలవంచుకుని నిలుచున్నారు. సంప్రదాయం ప్రకారం సమాధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చెక్కపెట్టెలో నికోసి జాన్సన్ శవాన్ని ఉంచారు.

అయిదు అడుగుల చెక్కపెట్టెకు తగిన విధంగా గొయ్యిని తవ్వి సిద్ధం చేశారు. ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన చిన్నారి నికోసి శవం నిస్తేజంగా ఉంది.

సంతాప సందేశాల కార్యక్రమం మొదలైంది.

దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షులు, ప్రపంచ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నెల్సన్ మండేలా సందేశాన్ని అతని సహాయకుడు వినిపించాడు. "నికోసి లాంటి పిల్లల బాల్యం బుగ్గికాకూడదు... ఆనందంతో తొణికిసలాడుతూ పసితనమంతా ప్రశాంతంగా గడపాలి.. నవ్వుతూ బతకాలి..." అని ఆకాంక్షించారు.

జింబాబ్వే మాజీ అధ్యక్షుడు కెన్నెత్ కౌండా "ఎవరూ మరణం కోసం ఎదురు చూడకూడదు. జీవించే కొద్దిపాటి కాలంలోనే ఆనందాన్ని ఆస్వాదించాలి.." అన్నారు.

శ్మశానంలో వాతావరణం ఉద్వేగంగా ఉంది.

చివరగా దక్షిణాఫ్రికా బిషప్ మాట్లాడారు. "పిల్లలు తమ పుట్టుకకు తాము బాధ్యులు కారు. పెద్దవారిలో సంతానోత్పత్తి లక్షణాలే పిల్లల పుట్టుకకు బాధ్యత వహిస్తాయి. తప్పు తోవ నడిచిన వ్యక్తులు తమ పాపాల శిలువ తాము మోయాలే తప్ప... ఏ తప్పూ చేయని చిన్నారులకు శిలువ వేయడం అత్యంత దారుణం... అన్నెంపున్నెం ఎరుగని పిల్లల్ని బలిపశువుల్ని చేయకండి-" అంటూ సందేశాన్ని ఇచ్చారు.

అందరిలోనూ భయంకరమైన నిశ్శబ్దం.

కార్యక్రమాలు మొదలయ్యాయి.

శవపేటిక గోతిలో దించారు. అందరూ సంతాప సూచకంగా మౌనం పాటించారు. పెట్టెమీద మన్ను పోసి పూడ్చిపెట్టారు. యాంత్రికంగా జరుగుతున్న దృశ్యాన్ని విషాద వదనాలతో అందరూ తిలకించారు. ప్రతివారి హృదయం బరువెక్కిపోయింది.

ఎవరూ లేని అనాథ... పుట్టినప్పటి నుంచి ఎయిడ్సుతో సహవాసం చేసి పన్నాలుగేళ్ళకే నూరేళ్ళు నిండిపోయిన నికోసి జాన్సన్ పసినవ్వులు అందరి కళ్ళముందు కదులుతున్నాయి. అక్కడికి వచ్చిన వారిలో అత్యధికులు నికోసి మృత్యుముఖంలోకి దూసుకుపోతున్న సమయంలో ఆనందాన్ని పంచి ఇవ్వడానికి వచ్చిన సంగీత విద్వాంసులు.. కళాకారులే వున్నారు.

నికోసి పెంపుడుతల్లి గెయిల్ జాన్సన్ కూడా రెండు కన్నీటిబొట్లు రాల్చి బైటికి వచ్చింది.

వెస్టుపార్కు చర్చిలో అంతర్జాతీయ బాలల దినోత్సవం నాడే ఆనందం ఆవిరి అయ్యింది.

* * *

శ్మశానంలో నికోసికి అందమైన సమాధి తయారైంది. రాతి పలకలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సిమెంటు పని దాదాపు పూర్తి అయ్యింది. శిలాఫలకం అమర్చడానికి ఖాళీ వదిలిపెట్టారు.

గెయిల్ జాన్సన్ అందమైన శిలాఫలకాన్ని తీసుకువచ్చింది. పాలరాతిపై నికోసి జాన్సన్ పుట్టిన తేదీ చనిపోయిన తేదీ చెక్కించింది. ఆ కింద "ఎయిడ్స్‌వ్యాధి ఉన్నవారు పిల్లల్ని కనవద్దు. కంటే ప్రపంచాన్ని, ఆనందాన్ని, బాల్యాన్ని, ప్రేమను చూడకుండా కన్ను మూస్తారు. మీ పిల్లలకు అమృతాన్నివ్వండి. ఆప్యాయతలు పంచండి... మీ చేతులతో మీరు చంపొద్దు" అని అందమైన అక్షరాలను చెక్కించింది.

ఆ కింద "అవకాశం వస్తే ఎయిడ్స్ బాధితుల్ని ఆదుకొనే అమ్మలు "కండి" అని రాసి అమ్మకాని అమ్మ గెయిల్ జాన్సన్" అని ఉంది.

ఆ పాలరాతి ఫలకాన్ని తాపడం చేసి గెయిల్ జాన్సన్ సంతృప్తిగా నిట్టూర్చింది. ★

కరెంటు తీగలు

(9వ పేజీ తరువాయి)

వసూలు చేసుకున్నాడు.

తీగను కొట్టుకురావటానికి ఆ పనుల్లో బాగా రాటుదేలిన రావడ్ని పిలిపించి అతనితో మూడు వేలకు బేరం కుదిర్చాడు.

* * *

రాత్రి 10 గంటలకు చేరువలో ఉంది సమయం. వెన్నెల్లో అంతా స్పష్టంగా కానవస్తోంది.

అప్పటికే సంక్రాంతి నెల పట్టి వారం దాటింది.

60, 70 కిలోమీటర్ల వేగంతో మోటారు సైకిలు నడుస్తుండటంతో చలికి తట్టుకోవటం దానిపై ఉన్న ఆ ఇద్దరికీ కష్టంగానే ఉంది. అప్పటికీ తలకు మప్లర్లు చుట్టుకున్నారు. చలి బన్నీలు వేసుకున్నారు.

అంత చలిలోనూ కొండయ్యకు చెమటలు పడుతున్నాయి. చొక్కా వీపు భాగం దాదాపుగా తడిచి పోయింది. మొహాన్నుంచి చెమట ధారలు కారుతున్నాయి. వాళ్ళు పెట్టుకున్న పని అట్లాంటిది మరి.

మోటారు సైకిలు వెనుక కూర్చున్న రావడు మాట వేరుగానీ, బండిని తోలుతున్న కొండయ్య మాత్రం ఆ వేళలో, ఆ దోవలో ప్రయాణించటం సాధారణంగా జరగదు.

వారం పది రోజుల నుంచీ ఆ ఇద్దరూ ఇప్పుడు పోతున్న పనిని అనుకుంటూ వస్తున్నారు. చివరకు ఇలా పని పెట్టుకున్నారు.

పొలం గట్ల వెంట .... గనుముల వెంట, కొండ పక్క నుంచీ .... వాగుల పక్క నుంచీ ప్రయాణిస్తోంది మోటారు సైకిలు.

"ఇంతకీ పనవుద్దంటావురా? రావడూ " ప్రశ్నించాడు కొండయ్య.

"అసెరూకోండి. మీ ఊళ్ళోనే దరిదాపులుగా ఏదెనిమిది మందికి తీగిచ్చాను. నువ్వట్ట సూత్తా ఉందు. సిటెకలో తీగ తెగ్గోసి మీ సేతులో పెట్టకపోతే అప్పుడనండి ఈ రావడ్ని." నమ్మకంగా పలికాడు అందరూ రావడు అని పిలిచే రాముడు.

"డబ్బులు తగ్గితే మాత్తరం ఊరుకోను. పాణాలకు తెగించి సేసే పని. నువ్వే సూత్తావుగా." మళ్ళీ తనే కల్పించుకుని విడమరచి చెప్పాడు రావడు.

"ఒరేయ్, పనికావాలే గానీ, అనుకున్న డబ్బు ఇప్పుడియ్యనంటరా". భరోసా ఇచ్చాడు కొండయ్య.

బండి వేగంగా సాగుతోంది. కొండయ్య ఆలోచనలూ సాగుతున్నాయి అంత వేగంగా.... అంత వంకర టింకరగా.

* * *

కరెంటు తీగ దొంగతనం చేస్తూ షాక్ తగిలి గుర్తుతెలియని వ్యక్తి ఎవరో చనిపోయినట్లు తాళ్ళూరు పోలీసు స్టేషనులో కేసు నమోదయింది.

కాకపోతే లంకోజిపల్లి రైతులు ఇంటికి వంద చొప్పున వేసుకుని 50 వేల రూపాయల్ని ఎస్ఐకి ఇచ్చారు.

కొండయ్యపేరుకు బదులు గుర్తు తెలియని వ్యక్తి అని కేసు పెట్టినందుకుగాను అతని బంధువులతో లక్ష రూపాయలకు ఎస్ఐ బేరం కుదుర్చుకున్నాడు.

" విద్యుద్ఘాతానికి గుర్తు తెలియని వ్యక్తి మృతి"

ఈ శీర్షికతో ఆ సంఘటన జరిగిన మూడో నాడు దినపత్రికల జిల్లా పేజీల్లో ఒక చిన్న వార్త ప్రచురితమయింది.

స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ఒక కొండయ్య కథ ముగిసింది... మరి కరెంటు కోసం రైతులు పడే బాధలు- అవి ఒక వూరికి పరిమితం కాదు... అంతటా నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి.... కాకపోతే కొండయ్యకు బదులు రామయ్య.... కృష్ణయ్య.... శీనయ్య.... అలా పేర్లు మాత్రం మారుతున్నాయి. రైతులే బలిపశువులవుతున్నారు.... ★

లక్ష్మి

గుండె తలుపులు

ఇంటికి దీపం ఇల్లాలే అన్నారు!

ఎవరన్నారని అడిగితే ఏం చెబుతాం?

అనాదిగా వినిపిస్తున్న అందమైన మాట. చాలా ముందుచూపుతో ఆర్యులెవరో సెలవిచ్చిన మాట!

ఇంటినిండా సిరులూ సంపదలూ మెండుగా వుండచ్చు. ఆ ఇంటో ఆడమనిషి లేకపోతే - ఆ సిరి సంపదలు కళాకాంతులకు నోచుకోవు!

ఇదెదో ఊసుపోకచెబుతున్న - ఉత్తుత్తి మాట కానేకాదు!

మేలిమి బంగారం లాటి విలువైన మాట!

ఆణిముత్యంలాటి అందమైన మాట!

అది మేడ కావచ్చు. మిద్దె కావచ్చు. అందులో ఆడమనిషి లేనప్పుడు పాడుపడిన కొంపమాదిరి వెలవెలబోతుంది!

అది పాత పెంకుటిల్లు కావచ్చు. పూరి పాక కావచ్చు. అందులో ఆడమనిషి వున్నప్పుడు - మణిదీపం మాదిరి వెలుగుతుంది!

ఇంటో ఆడమనిషి వుండాలనే రూలు మాదిరే - ఇంటికి తలుపులు తప్పనిసరిగా వుండాలనే నిబంధన కూడా వుంది!

తలుపుల్లేని ఇంటోకి కుక్కలూ, పిల్లులూ దర్జాగా ప్రవేశిస్తాయి. దొంగలు రొమ్ము విరుచుకుని - రాజు వెడలె బాణీలో అడుగుపెడతారు! అంచేత -

ఇంటికి దీపం ఇల్లాలే అన్నట్టు -

ఇంటికి తలుపాక రక్ష అంటారు!

తలుపు కనిపించగానే - ఎంతటి వాడికైనా మర్యాద జ్ఞాపకం వస్తుంది. చొరవ చేసి తలుపు తెరుచుకుని లోపలికి అడుగుపెట్టలేడు. తలుపు తడతాడు. తానెవరో ఎందుకొచ్చేడో చెబుతాడు! ఆ తర్వాతగాని తలుపు తెరుచుకోదు!

మన సాహిత్యంలో తలుపుకి గొప్పస్థానమే వుంది!

ఇంటో అలిగిన వేళ తలుపే ఒక రాయబారి!

భార్యతో తగువు పడిన భర్త - తాను చెప్పదలుచుకున్నది భార్యకి చెప్పడు. ఏమి చెప్పినా తలుపుతోనే చెబుతాడు!

ఆమె కూడా అంతే! తలుపుతోనే చెబుతుంది!

భోం చేయమని చెప్పవే తలుపా అంటుంది!

ఆకల్లేదని చెప్పవే తలుపా అంటాడు!

అలకెందుకు లేదో అడగవే తలుపా అంటుంది!

ఎప్పుడూ పప్పు చారేనా తలుపా అంటాడు!

ఇవాళ కోడి కూరని చెప్పవే తలుపా అంటుంది!

ఫినిష్. అంతమాట వినగానే అతను తట్టుకోలేడు. గబగబా కాళ్ళు కడుక్కుంటాడు. తన కంచం తెచ్చుకుని కూచుంటాడు!

ఆమె వడ్డిస్తుంది. అతను ఆబగా మింగుతుంటాడు!

ఆ తిండి కార్యక్రమం తాలూకు ఒకానొక దశలో - అతను కలిపిన ముద్దను ఆమె చేత ముద్దార తినిపించి మురిసిపోతాడు!

అంచేత -

భార్యాభర్తలిద్దరి ఆర్గ్యుమెంట్లను విని రాజీ కుదిర్చే దినుసు పేరు - తలుపు!

ఈ తలుపంటూ లేకపోతే ఎడమొహాలూ, పెడమొహాలు ఎక్కువవుతాయి!

సుఖం బొత్తిగా కరువైపోతుంది!

ఒక్కో తడవ - అర్ధరాత్రి వచ్చిన భర్తకి తలుపాక చెక్‌పోస్టుగా వుంటుంది. భర్త కండిషన్లో వున్నాడో లేదో - తలుపు తియ్యకుండానే తెలుసుకుంటుంది!

సవ్యంగా వచ్చేడని గమనిస్తే, తలుపు తెరుచుకుంటుంది!

అపసవ్యంగా వచ్చేడని అర్థమైతే ఆ రాత్రికి అంతేసంగతులు!

ఈ తలుపు గొడవ ఇప్పటిది కాదు. పురాణ కాలంలో కూడా వుంది. గోపాలకృష్ణుడు కూడా తలుపుతో చాలా ఇబ్బందులు పడ్డాడు!

చిటపట చినుకులు దుప్పటి తడిసెను

తలుపు తీయవే భామా-

అని కృష్ణుడంటె...

అర్ధరాత్రివేళ నిద్దుర పొద్దులో

ఎవరని తీతునో స్వామీ-

అని గోపిక అడుగుతుంది. స్వామివారు తమ చిరునామా చెబుతుంటాడు. చెప్పేకొద్దీ మరికొన్ని వివరాలు ఈవిడ అడుగుతూనే వుంటుంది!

అదొక రసవద్ఘట్టం!

గుండె పులకిస్తుంది!

అందులో ప్రధానమైన పాత్ర తలుపుకి దక్కుతుంది. తలుపా! నీకు చేతులెత్తి మొక్కాలి!

ఇళ్ళకే కాదు -

గుండెలక్కూడా వుంటాయి తలుపులు!

ఇవి కనిపించవు. కనిపించనంత మాత్రాన గుండెలకు తలుపులుండవని చెబితే తొందరపాటవుతుంది!

గుండె తలుపుల్ని -

అయినవాళ్ళు తడితే ఆలోమేటిగ్గా తెరుచుకుంటాయి. కానివాళ్ళు ఎంత బాదినా ప్రయోజనం సున్నా అని చెబుతాయి!

గుండె తలుపులు సుతిమెత్తగా వుంటాయి. అందమైన అనుభూతికి ఆహ్వానమంటాయి. ఆత్మీయతకు స్వాగతం పలుకుతాయి!

ముఖ్యంగా ఆడవాళ్ళు-

ఇంటి తలుపుల కంటే గుండె తలుపులకు ఎక్కువ విలువ ఇస్తుంటారు. అందుకే ఆ తలుపులు జాగ్రత్త అని హెచ్చరిస్తుంటాను! ★

'వెల'గల ప్రజాస్వామ్యం

రుక్మిణి

జక్కులోడికి రాందాసు చిన్నప్పటి దోస్తు – వాడు చాలా కష్టాలు పడ్డాడు. బతకడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. పడి, వున్న వూర్లో నిలవలేక పట్నం చేరుకున్నాడు. వాడికెందుకో ఒకేసారి కన్నవూర్ని చూడబుద్ధయింది. అంతే! వూర్లోకి వూడిపడి జక్కులోడ్ని కావిలించుకున్నాడు. జక్కులోడు వాడ్ని చూసి పరేషాన్! వీడు చిన్ననాటి రాందాసేనా? ఇపుడు పట్నంపోయి బతుకుదెరువు నేర్చుకున్నాడు. పల్లెల్ల ఏముంది గనక? చప్టామీద కూలబడి జక్కులోడిలో ఎన్నో ప్రశ్నలు... రాందాస్ పొడుగు సిగరెట్ వెలిగించాడు.

"అరె జక్కులోడా... అంతా బాగేగదర... అరె... అట్ల గుబులు పడతవేందిర? ఖర్చులు... కష్టాలు ఎపుడుండేయ్‌గద! ఓర్ని... ఈసారి సీజను కూడా సంపాదించాలె"

లటలట వాడు వాగుతుంటే జక్కులోడు నోరెళ్ళబెట్టి వినుడే సరిపాయె – మాటల పుట్ట – సీజనంటడు – సంపాదన... ఏంటో అర్థం కాదు.

"అరె రాందాసు... సీజనేందిర? మామిడికాయలా... మిర్చా పత్తా.. (జక్కులోడికి ఒక్కసారే ట్యూబులైటు వెలిగింది – అపుడే రాందాసు సెల్‌ఫోను మోగింది) ఎలక్షన్ల... ఆహా..." జక్కులోడ్ని ఆగమని సైగచేసి రాందాసు సెల్‌లో మాట్లాడాడు. "అరె.. మంచిదిరా... మరో రెండు గంటల్లో అక్కడుంటా... జర అడ్డ దగ్గరకు పోయి హుషారు చెయ్యి. డేట్లు నేను ఫిక్సు చేస్తలేరా... అరె.. అన్నీ అడ్జస్టయిపోతయి – ఫోన్ల దగ్గర్నుండి కదలకు" అని సెల్ ఆఫ్ చేశాడు.

"గదేరా... ఈసారి సీజను ముందస్తుగా వచ్చిందిగద... అటూఇటూ సరచి సంపాయించుకోటం లేదూరా... జనం కూడా బాగా ఎదిగి పోయిన్నురు... అదే మంచిది – మనూర్లె నాలుగైదు పార్టీలు.. నలభైమంది రెబల్సు.. సపోర్టర్లు... చోటా నాయకులుండిరి. మల్లా దిగులెందుకురా.. దినాం ఒకడ్ని సరిచినా...

జక్కులోడికి తను వెధవననే భావాన్ని రాందాసు కలిగించినాడో... తనంతట తనకే వచ్చిందో అర్థం కాలేదు.. కానీ గుబులయింది.

"అరె... అది కాదురా రాందాసూ... నీ మతలబేందో గది చెప్పు... ఏం వ్యాపారం... పెట్టుబడెంత... ఎక్కడా?

రాందాసు మరో సిగరెట్ వెలిగించాడు. 'ఒరే... జనవే మన వ్యాపారం... అంతా లీగల్.. పెట్టుబడి కూడా జనమే.. అడ్డాలంటవా... సిటీలో అయిదారున్నాయి. జిల్లాల వారీగా వచ్చే సీజను నాటికి బ్రాంచీలు తెరవాలె.. కొనకు దీన్లోకూడా పోటీ వచ్చిపడింది. ఏం చేస్తాం... మాలాంటోళ్ళందరం కలిసి సంఘం పెట్టి 'రిజిస్ట్రీ' చేయించి పారేస్తే ఎవని హద్దులు.. టెరిటరి వాడికుంటది! కమీషన్లకు బదలాయించవచ్చు. అడ్డాలు లీజులకిచ్చుకోవచ్చు... బ్యాంకులోన్లు పీకొచ్చు..

జక్కులోడికిదంతా అయోమయమై 'తనెంత వెధవ... చండాల నీచమానవుడ్నో' అన్న కలవరం అధికం కాజొచ్చింది. "అరె... ఇవరం చెప్పరాదురా..." ఓ కసురు కసిరాడు. రాందాసు సిగరెట్ విసిరిపారేసి తన దండకం వివరాలను తీరిగ్గా మొదలు పెట్టాడు.

"జక్కులూ... ఇపుడు ఎలక్షను సీజనొచ్చింది. జనాలకు కూలీ... ఉద్యోగాల్లేక నకనకలాడుతున్నారు. ఎంతోకొంత సంపాదించాలె. పని చెయ్యాలె – కద! అక్కడ్నుంచే మన ఇండస్ట్రీ షురూ! రకరకాల రాజకీయ పార్టీల వాండ్లకూ, ఆ నాయకులకూ జనం కావాలె! ఇంతకు ముందులా పార్టీ కోసం పన్జేసే జనాభా తగ్గిపోయింది – అంతా మార్కెటు మాయాజాలం గద! పోనీ... పోనీ..... విను...

ఒకటి : ఎలక్షను ప్రకటన వచ్చినప్పటి నుండి టిక్కట్లు సంపాదించడానికి 'జేజేలు, 'జిందాబాదులు' కొట్టడానికి బాగా జనం అక్కర పడతారు.

రెండు : నామినేషన్ల పర్వంలో... దానికి ముందు మీటింగులకీ భారీ దండు కావాలె! తర్వాత ప్రచార సభలకూ... పాదయాత్రలకూ... అబ్బో... అట్లా... బ్యానర్లు... తోరణాలు... కరపత్రాలు కొట్టిపిచ్చి కట్టిచ్చుకోటానికి ఎట్లా డబ్బు ఇంతకుముందు ఖర్చు పెడ్తున్నరో... ఇపుడు జనాలను పిలిపించుకుని హంగామా చేయటానికి కూడా ఖర్చు పెట్టాలె! నేను అయిదారు అడ్డాలల్ల వలస కూలీలను... పనులు దొరకని యువకులను నా సంస్థలో రిజిస్ట్రీ చేయించిన! అడ్డాకో వెయ్యి మంది దాకా వుంటారు. ఆడామగా కలిపి... నా లెక్కలు ఇట్లా ఉంటాయి.

1. సాధారణ మీటింగుకు పూటకు మనిషికి – భోజనం పెట్టి వందరూపాయలు మహిళలకు, నూటయాభై – మగవాండ్లకు ఒక చీపు లిక్కరు క్వార్టరు, వాహనం ఏర్పాటు – జెండాలు..! మనకు శాల్తీకి పదిహేను రూపాయలు కమీషను.

2. ర్యాలీ – దీన్లో నాయకుడి వెంట నడక ఉంటుంది. నినాదాలు చెయ్యాలె – పై రేటు మీద వాళ్ళకు మరో పదిహేను శాతం పెచ్చు! నాన్‌వెజ్జు – నాకు మరో అయిదుశాతం కమిషను.

2(బి) ర్యాలీలు ఆకర్షణీయంగా వుండడానికి వివిధ రకాల డ్రస్సులు – కాస్ట్యూంలు జరంత కాస్ట్లీ – లంబాడీ వేషాలు వేసుకుంటే మూడు వందలు. కోయ కొమ్ములు డ్రమ్ములు. నెమలి పించంగాళ్ళకు మనిషికి అయిదొందలు.... నా కమీషను నలభైశాతం!

2(సి) ర్యాలీలో డప్పుల బృందాలకు డిటో – సైరేట్లే! దాన్సింగులు చేసే ఆడవాండ్లు కూడా వుంటారు. వాళ్ళ రేటు సెపరేటు."

జక్కులోడు అవాక్కయి నోరెళ్ళబెట్టి చెవులప్పగించాడు.

3. ఇందులోనే ఒకే రోజు రెండు పార్టీల వాళ్ళకు పోయే హక్కు మాకుంది. వీలైతే మూడు – ఒక పార్టీర్యాలీ కాంగానే చేతిలోని ఆ పార్టీ జెండాలు అవతల విసిరిపారేసి మరో పార్టీ జెండాలందుకుంటారన్నమాట. అబ్బో – దానికి ముందే ట్రయినింగిస్తాం!

4. కొన్నిసార్లు రిస్కుంటుంది – పోలీసు... లాఠీ ఛార్జిలాంటివి జరిగి తలలు పగులుట, అవయవ నష్టం జరిగితే సదరు పార్టీయే ఖర్చులు భరించాలె – అట్లాంటి వాటిని ముందే కనుక్కుని అరేంజిమెంట్లు చేస్తాను...!"

"అంటే వీళ్ళందరికీ పార్టీలు లేవా... ఏదో పార్టీకి అంకితం కావడం వుండదా?" జక్కులోడు అడిగాడు. రాందాసు ముసిముసిగా నవ్వాడు.

"ఒరే... అసలు టయానికి తీరిక చిక్కితే వీళ్ళు ఓటు వేస్తారు. – లేకపోతే లేదు. బతుకు మీద రంధేనాయె! స్వర్ణాంధ్రలో పూటగడుసుడే కష్టం గద! ఇంగ ఈ పార్టీల వెనుకబడి వూరికె తిరిగితే బువ్వ దొరుకుద్దా... ఇపుడే ఇట్లా సంపాదించుకోవాలె..." సెల్ మోగడంతో రాందాసు హడావుడిగా ఆదేశాలిస్తున్నాడు. యాద్గిరి అప్పటి దాకా విన్నదంతా విని ఫెళఫెళ నవ్వాడు. "ఏందే యాద్గిరన్న... జనం ఇట్లా తయారైపోతున్నారు." జక్కులోడు అడిగాడు.

"ఒరే... వీళ్ళే బెటర్రా... నిజాయితీగా నాలుగైదు గంటలు పని చేసి డబ్బులు తీసుకుంటున్నారు. మరి ఈ రాజకీయ నాయకులు ఏ పార్టీ నుండి, ఎపుడు ఏ పార్టీలోనికి దునుకుతరో అసలర్థం కాదాయె! ఇంత ఖర్చు చేసి గెలిస్తే దానికి వందలరెట్లు సంపాయించుడాయె! వాండ్లకే నీతి – నియమాలు లేకపాయె!" ★

డాక్టర్ ఎ.హెచ్.వి. సుబ్బారామయ్య
గ్యాస్ట్రో ఎంటెరాలజీ శాఖాధిపతి, గుంటూరు ప్రభుత్వాసుపత్రి

జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధుల్లో అశ్రద్ధ తగదు

మనిషికి కావాల్సిన ప్రాథమిక అవసరాల్లో 'తిండి' ఒకటి. తిన్న తిండి వంటపట్టాలంటే ముందు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా వుండాలి. అప్పుడే తిన్న తిండి జీర్ణమై, రక్తం ద్వారా జీవకణాలకు చేరి శరీరానికి శక్తిని ఇస్తుంది. అలాంటి శక్తి జనిత జీర్ణవ్యవస్థలో అసాధారణతలు చోటు చేసుకొన్నప్పుడు విరోచనాలు, వాంతులు, మలబద్ధకం, పెప్టిక్ అల్సర్, సిర్రోసిస్ ఆఫ్ లివర్, పాంక్రియాటైటిస్, జాండిస్ వంటి జీర్ణ వ్యవస్థ సంబంధ వ్యాధులు మనుషుల్ని తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తాయి. అసలీ వ్యాధుల్ని అంతదాకా ఎందుకు రానివ్వాలి? ముందు జాగ్రత్తల ద్వారా, వ్యాధుల లక్షణాలు అగుపడిన వెంటనే నిపుణులైన వైద్యుల్ని సంప్రదించడం ద్వారా దారి తప్పిన జీర్ణవ్యవస్థను మళ్ళీ దారిలో పెట్టడం అంత కష్టతరం కాబోదు.

● 'గ్యాస్ట్రో ఎంటెరాలజి' అంటే ఏమిటి ? పుట్టుపూర్వోత్తరాలను తెలుపుతారా?

మానవ శరీరంలోని జీర్ణవ్యవస్థ – వాటికి సంబంధించిన వ్యాధుల అధ్యయన శాస్త్రాన్ని 'గ్యాస్ట్రో ఎంటెరాలజి' అంటారు. జీర్ణనాళంతో పాటు, లివర్ (కాలేయం), పాంక్రియాస్ (క్లోమం), స్ప్లీన్ (ప్లీహం) మొదలైన అవయవాలు కూడా జీర్ణవ్యవస్థ కిందకే వస్తాయి. ఎమ్.డి. జనరల్ మెడిసిన్ లేదా పిడియాట్రిక్స్ చేసినవారు డి.ఎమ్. గ్యాస్ట్రో ఎంటెరాలజి చేయడానికి అర్హులవుతారు. మన రాష్ట్రానికి సంబంధించి డా॥ హబీబుల్లా మొట్టమొదటి గ్యాస్ట్రో ఎంటెరాలజిస్టు.

● సాధారణ జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధులేమిటి ?

జీర్ణ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులలో విరేచనాలు (డయేరియా), వాంతులు (వామ్‌టింగ్స్), కామెర్లు (జాండిస్), పెప్టిక్ అల్సర్, గాల్‌స్టోన్స్, అజీర్తి, మలబద్ధకం (కాన్‌స్టిపేషన్), సిర్రోసిస్ ఆఫ్ లివర్ (లివర్లు), లివర్ క్యాన్సర్, పాంక్రియాటైటిస్, హెపటైటిస్, జీర్ణాశయ క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్, గాస్ట్రైటిస్ మొదలైన వ్యాధులు పేర్కొనదగినవి.

● జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధుల ప్రత్యేక, సాధారణ లక్షణాలేమిటి ?

ఈ లక్షణాలు ఆయా వ్యాధులను బట్టి ఉంటాయి. వాంతులు, విరోచనాలు వంటివి వ్యాధులగానే కాక కొన్ని ఇతర జీర్ణ వ్యవస్థ సంబంధ వ్యాధుల లక్షణాలు కూడా కావచ్చు. కడుపులో మంట అనిపించడం పెప్టిక్ అల్సర్ లక్షణం కావచ్చు. కళ్ళు పచ్చబడడం, ఆకలి లేకపోవడం, యూరిన్ పసుపు పచ్చగా రావడం వంటివి కామెర్ల లక్షణాలుగా బయటపడవచ్చు. ఆకలి లేకపోవడం, తేపులు రావడం వంటివి అజీర్తి లక్షణాలు అవ్వవచ్చు. లివర్ పెద్దదవ్వడం, పొట్టలో నీరు చేరడం (ఎసైటిస్), ఆకలి లేకపోవడం, రక్తపు వాంతులు (హిమటెమిసిస్) సిర్రోసిస్ ఆఫ్ లివర్ లక్షణాలు. విరోచనంలో బంకపడడం అమీబియాసిస్ లక్షణం కావచ్చు. ఆకలి లేకపోవడం, ఉమ్మిలో రక్తం పడడం, తిన్న అన్నం అరగకపోవడం, బరువు కోల్పోవడం వంటివి జీర్ణాశయ క్యాన్సర్ లక్షణాలు కావచ్చు. రోగిని క్షుణ్ణంగా పరిశీలించాక గాని వ్యాధిని గుర్తించడం సాధ్యం కాదు.

● పెప్టిక్ అల్సర్ అంటే ఏమిటి ? ఎందుకు వస్తుంది ?

జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని స్రవించే గ్రంథులుంటాయి. ఈ హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారం జీర్ణం కావడానికి చాలా అవసరం. కొన్ని అసాధారణ పరిస్థితులలో జీర్ణాశయంలో ఈ ఆమ్ల స్రావం పెరిగిపోతుంది. అందువల్ల జీర్ణాశయంలోని లోపలి పొర అయిన మ్యూకోజా జీర్ణింపబడి 'పుండు' పడుతుంది. దీనినే పెప్టిక్ అల్సర్ అంటారు. ఈ అల్సర్ జీర్ణాశయంలో వుంటే గ్యాస్టిక్ అల్సర్ అని, జీర్ణాశయం తర్వాత భాగమైన డయోడినంలో వుంటే డుయోడినల్ అల్సర్ అని అంటారు. అల్సర్ ఏర్పడడానికి మూలకారణమైన ఆమ్ల స్రావం ఎక్కువ కావడానికి కారణం మిర్చిమసాలాలు ఎక్కువగా తీసుకోవడం, ధూమపానం, మద్యపానం, కాఫీ, టీలు ఎక్కువగా తీసుకోవడం, భోజనం విషయంలో అలక్ష్యం అంటే రోజూ వేళకు భోజనం చేయకపోవడం, మానసిక ఒత్తిడులకు లోనవడం, ఆదుర్దా, ఆందోళనలకు గురి కావడం వంటివి పేర్కొనదగినవి. ఈ మధ్యనే పెప్టిక్ అల్సర్ 'హెలికోబాక్టర్' అనే సూక్ష్మక్రిమి వల్ల కూడా వస్తుందని వైద్య నిపుణులు గుర్తించడం జరిగింది.

● కామెర్ల వ్యాధి (జాండిస్) అంటే ఏమిటి ? అందులోని రకాలేమిటి ?

మామూలుగా కళ్ళు పచ్చగా కనబడడాన్ని పచ్చకామెర్లు అంటాం. రక్తంలోని 'బైలురుబిన్' అనే వర్ణక పదార్థం పెరిగిపోవడాన్నే పచ్చకామెర్లు లేదా జాండిస్ అంటారు. (సాధారణంగా ఆరోగ్యవంతుని ప్రతి 100 మి.లీ. రక్తంలో 0.8–1 మి.గ్రా బైలురుబిన్ వుంటుంది) రక్తంలో బైలురుబిన్ పెరిగిపోయే విధానాల ఆధారంగా జాండిస్‌ను మూడు రకాలుగా విభజించడం జరిగింది *(1) కాలేయ కణాలకు ఇన్‌ఫెక్షన్ సోకడం వల్ల వచ్చే* జాండిస్‌ను ఇన్‌ఫెక్టివ్ జాండిస్ అంటారు. దీనినే వైరల్ హెపటైటిస్ అని కూడా వ్యవహరిస్తూ వుంటారు. ఇది కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం, అపరిశుభ్రమైన అంటే హెపటైటిస్ వైరస్ వున్న వ్యక్తుల రక్తాన్ని స్వీకరించడం, సరిగా స్టెరిలైజ్ చేయని సిరెంజులు, సూదులు వాడడం మొదలైన వాటివల్ల

వ్యాపిస్తుంది. ఈ హెపటైటిస్ వైరస్‌లలో అయిదు రకాలున్నాయి. ఏ, బి, సి, డి, ఇలుగా పేర్కొనే ఈ వైరస్‌లలో సాధారణంగా 90 శాతం పచ్చకామెర్లు ఏ లేదా ఇ రకానికి చెందిన వైరస్‌ల వల్ల వస్తుంటాయి. ఈ వైరస్ వల్ల వచ్చే జాండిస్‌కు ప్రత్యేకమైన ఎలాంటి వైద్యం తీసుకోకుండానే వాటంతటవే తగ్గిపోతాయి. అందుకనే వీటిని "సెల్ఫ్ లిమిటింగ్ డిసీజెస్"లలో చేర్చటం జరిగింది. బి, సి వైరస్‌ల వల్ల వచ్చే జాండిస్ కాస్త ప్రమాదకరమైనది. వైద్యుని సంప్రదించి జాండిస్ కారణమైన వైరస్‌ను తెలుసుకోవడం చాలా మంచిది. కొందరిలో లివర్ 'యాబ్సిస్' రావడం వల్ల కూడా జాండిస్ రావచ్చు.

(2) మామూలుగా కాలేయంలో తయారైన పైత్యరసం (బైల్) పైత్యరస నాళం ద్వారా జీర్ణనాళాన్ని చేరుతుంది. గాల్‌బ్లాడర్‌లోగాని, పైత్యరస నాళంలోగాని ఏదైనా అవరోధం ఏర్పడినా, రక్తంలో బైలురుబిన్ పెరిగిపోయి జాండిస్‌కు దారితీస్తుంది. దీనినే అబ్‌స్ట్రక్టివ్ జాండిస్ అంటారు. సాధారణంగా, 'గాల్‌స్టోన్స్' ఈ రకమైన జాండిస్‌కు కారణమవుతుంటాయి.

(3) హిమోలైటిక్ జాండిస్‌ను మూడోరకమైన జాండిస్‌గా పేర్కొనవచ్చు. ఎర్రరక్తకణ నిర్మాణంలోని లోపాలు, మలేరియా వంటి పరాన్న జీవ వ్యాధులు, కొన్ని రకాల మందుల వాడకం ఎర్రరక్తకణాలను అసాధారణ విచ్ఛిత్తికి గురి చేస్తాయి. ఫలితంగా రక్తంలోని బైలురుబిన్ పెరిగిపోతుంటుంది.

ఇంకా క్షయవ్యాధికి వాడే రైఫాంపిసిన్ వంటి కొన్ని రకాల మందులు కూడా జాండిస్‌కు కారణమవుతాయి. మందుల వాడకం వల్ల వచ్చే జాండిస్‌ను డ్రగ్ ఇండ్యూస్డ్ జాండిస్ అంటారు.

● గాల్‌స్టోన్స్ ఎలా ఏర్పడతాయి ? వీటి గురించి కాస్త వివరిస్తారా?

గాల్‌స్టోన్స్ ఎక్కువగా ఆహారంలో కొవ్వు పదార్థాలు తీసుకునే వారిలోను, వయస్సుకు మించిన బరువు కలిగి ఊబకాయ శరీరం గల వారిలోను ఏర్పడుతుంటాయి.

పైత్యరస నాళంలో అవరోధం ఏర్పడినప్పుడు పైత్యరసం గాల్‌బ్లాడర్‌లో ఎక్కువ కాలం నిలిచి వుంటుంది. అందువల్ల గాల్‌స్టోన్స్ ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాల్‌స్టోన్స్ వున్న వారందరిలోను లక్షణాలు బయటపడవు. కేవలం 35 శాతం మందిలో మాత్రమే గాల్‌స్టోన్ లక్షణాలు బహిర్గతపరచి అస్వస్థతకు గురి చేస్తాయి. ఈ స్టోన్స్ పైత్యరస ప్రవాహానికి అడ్డుపడి జాండిస్‌కు కారణమవుతాయి. ఈ స్టోన్స్‌ను అవి వున్న ప్రదేశం, సైజు ఆధారంగా వివిధ రకాల శస్త్ర చికిత్సల ద్వారా తొలగించ వీలున్నది. అయితే కొందరిలో గాల్‌బ్లాడర్ మొత్తం తీసేయాల్సి రావచ్చు.

● సిర్రోసిస్ ఆఫ్ లివర్' అంటే ఏమిటి? ఎలా వస్తుంది?

కాలేయం హైపాటిక్ సెల్స్‌తో నిర్మితమవుతుంది. మానవ శరీరంలో గ్రంథులన్నింటిలోకి అతి పెద్ద గ్రంధి కాలేయమే.

ముఖ్యంగా 'బి' టైప్ వైరల్ హెపటైటిస్‌కు గురి అయిన కొందరిలోను, అధికంగా మత్తు పానీయాలు సేవించేవారిలోను, కొన్ని రకాల మందులు వాడడం, మొదలైన వాటివల్ల కాలేయ కణాల్లో అసాధారణ మార్పులు చోటు చేసుకొని, లివర్ అంతర్నిర్మాణం అంతా మారిపోతుంది. చివరకు ఫైబ్రోసిస్ వస్తుంది. ఫలితంగా లివర్ విధి నిర్వహణలో లోపాలు వస్తాయి. దీనిని సిర్రోసిస్ ఆఫ్ లివర్ అంటారు.

● అజీర్తి, విరోచనాలు, మలబద్ధకం వీటి గురించి కాస్త వివరంగా తెలియజేస్తారా ?

జీర్ణవ్యవస్థకు సంబంధించిన అతిసాధారణ వ్యాధులివి. సాధారణంగా జీర్ణక్రియకు కావలసిన ఎంజైములు తక్కువ అవ్వడం వల్ల అజీర్తి చేస్తుంది. ఇందుకు కచ్చితమైన కారణాలను చెప్పడం కష్టమైన విషయమనే చెప్పాల్సి వుంటుంది. కాలేయం, క్లోమం వంటి గ్రంథులు సరిగా పని చేయకపోవడం కొంతవరకు కారణాలు కావచ్చు. అసలు విరోచనం కాకపోవడాన్ని లేదా చాలా గట్టిగా అవడాన్నే మలబద్ధకం లేదా కాన్‌స్టిపేషన్ అంటారు. ఈ లక్షణం ముఖ్యంగా ఆహారంలో పీచు పదార్థాలు తగ్గడం వల్ల వస్తుంది.

● వాంతులు ఎందుకొస్తాయి ? వాంతులలో రక్తం పడడానికి కారణాలేమిటి?

వాంతులు జీర్ణవ్యవస్థకు సంబంధించిన ఒక లక్షణమనే చెప్పాలి. నిజానికి వాంతులకు చాలా కారణాలున్నాయి. మీజిల్స్, న్యూమోనియా, జాండిస్, గాస్ట్రైటిస్, ఎపెండిసైటిస్, పెప్టిక్ అల్సర్, జీర్ణాశయ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, జీర్ణనాళం మూసుకుపోవడం రక్తంలో యూరియా శాతం పెరిగిపోవడం, మైగ్రేన్, మెనింజైటిస్ మెట్రోజిల్, ఏస్పిరిన్ వంటి కొన్ని రకాల మందుల వాడకం వాంతులకు కారణం అవుతుంటాయి.



● అనొరెక్జియా అంటె ఏమిటి ?

ఆకలి లేకపోవడాన్నే వైద్యశాస్త్ర పరిభాషలో అనొరెక్జియా అంటారు. దీనికి గల కారణాలలో గాస్ట్రైటిస్, జీర్ణాశయ క్యాన్సర్, కాలేయ సంబంధ వ్యాధులు, మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోవడం (అంటే రీనల్ ఫెయిల్యూర్) క్షయవ్యాధి, కొన్ని రకాల మందులు (డిపాజిటాలిన్ వంటివి) పేర్కొనదగినవి. ఇంకా యాంగ్జైటి, డిప్రెషన్ వంటి మానసిక సంబంధ వ్యాధులలో కూడా ఆకలి తగ్గిపోవడం జరుగుతుంది.

● ఎక్కిళ్ళు ఎందుకొస్తాయి ? వీటి గురించి వివరిస్తారా?

ఎక్కిళ్ళని హిక్‌కఫ్ అని అంటారు. ఇవి సాధారణంగా దయాఫ్రమ్ కదలికల్లోని తేడాల వల్ల వస్తాయి. కొందరిలో అయితే కారణాన్ని కనుక్కోలేము. యూరీమియా, ఎసిడోసిస్, మెనింజైటిస్, పెరికార్డైటిస్ వల్ల కూడా ఈ ఎక్కిళ్ళు వస్తుంటాయి.

● డిస్‌ఫేజియా అంటే ఏమిటి ? కారణాలేమిటి ?

ఆహారం సరిగా మింగలేకపోవడాన్ని డిస్‌ఫేజియా అంటారు. ఇందుకు కారణాలలో నోటిక్యాన్సర్, నాలుక, చిగుళ్ళపై పుళ్ళు పడడం, టాన్సిలైటిస్, పక్షవాతం వచ్చి నరాలు దెబ్బతిని కండరాల కదలికలు లేకపోవడం వంటివి పేర్కొనదగినవి.

● ఎసైటిస్ అంటే ఏమిటి ? ఎలా వస్తుంది ?

పొట్టలోని పొరల మధ్య (పెరిటోనియల్ కావిటిలో) నీరు చేరడాన్ని 'ఎసైటిస్' అంటారు. సిర్రోసిస్ ఆఫ్ లివర్, హార్ట్ ఫెయిల్యూర్, జీర్ణాశయ క్షయ, స్త్రీలలో అండాశయ క్యాన్సర్, పెరిటోనైటిస్ మొదలైన వ్యాధులలో పొట్టలోని పొరల మధ్యన నీరు చేరుతుంటుంది.

● జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధుల ప్రత్యేక నిర్ధారణ పరీక్షలేమైనా ఉన్నాయా?

జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధుల నిర్ధారణకు నేడు అనేక రకాల ప్రత్యేక పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి.

● నేడు జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధులకు లభ్యమవుతున్న ఆధునిక వైద్య చికిత్సా సదుపాయాలేమిటి ?

జీర్ణ వ్యవస్థ సంబంధ వ్యాధులకు నేడు అనేక రకాల వైద్య చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయనే చెప్పాలి. నేడు అనేక జీర్ణకోశ వ్యాధులకు శస్త్ర చికిత్స అవసరం లేకుండానే అత్యాధునిక వైద్య ప్రపంచం అందించిన ఔషధాల ద్వారా, స్కోపి ద్వారా చికిత్స చేసే విధానాలు వచ్చేశాయి. కొన్ని వ్యాధులలో మాత్రమే నేడు శస్త్ర చికిత్స అవసరమవుతుంది. ఏది ఏమైనా వ్యక్తులు జీర్ణవ్యవస్థ సంబంధ వ్యాధులలో అశ్రద్ధ చేయకుండా ఎంతముందు మేల్కొంటే అంత మంచిది అన్న వాస్తవాన్ని గ్రహించాలి.

● జీర్ణ వ్యవస్థ సంబంధ వ్యాధుల బారిన పడకుండా, ముందుగానే నిరోధించే మార్గాలేమైనా వున్నాయా?

వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స కంటే అసలా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా ఉత్తమం అని ప్రత్యేకంగా చెప్పాలా? ప్రమాదకర వ్యాధుల విషయంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే... మీ ఆరోగ్యానికి ఢోకా ఉండదంటే అతిశయోక్తి కాబోదు. మనం పాటించే చిన్న చిన్న జాగ్రత్తలే, అతి ప్రమాదకర వ్యాధుల్ని సైతం మనం పారద్రోలగలమనడంలో అసత్యం లేదు. కాచి, చల్లార్చి వడకట్టిన నీటిని తాగడానికి వాడడం ద్వారా ఎన్నో రకాల సూక్ష్మ జీవసంబంధ వ్యాధుల్ని నిర్మూలించవచ్చు. ఆహార పదార్థాలపై క్రిమికీటకాలు వాలకుండా జాగ్రత్త పడడం, సరిగ్గా మూతలు వేసి వుంచడం, వేడివేడిగా వున్నప్పుడే భుజించడం వంటివి వ్యాధుల నిరోధంలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఇంజక్షన్ల అవసరం వస్తే తప్పని సరిగా బాగా స్టెరిలైజ్ చేసిన లేదా డిస్పోజబుల్ పరికరాలనే ఉపయోగించడం మంచిది. దానివల్ల ప్రమాదకరమైన హెపటైటిస్ 'బి' వైరల్ వ్యాధిని నిరోధించవచ్చు. అలాగే రక్తమార్పిడి అవసరమైతే, ఆ రక్తం పూర్తిగా వ్యాధికారక సూక్ష్మజీవరహితం అని పరీక్షల ద్వారా నిర్ధారించిన తర్వాతే రక్తాన్ని స్వీకరించాలి.

మత్తుపానీయాలు, ధూమపానం వంటి దుర్వ్యసనాలకు దూరంగా వుండడం వల్ల సిర్రోసిస్ ఆఫ్ లివర్, పెప్టిక్ అల్సర్ వంటి వ్యాధులు దూరమవుతాయి. ఆహారంలో కారం, మసాలా దినుసులు తగ్గించి వాడడం జీర్ణవ్యవస్థకు శ్రేయస్కరం. వేళకు భోజనం చేయడం కూడా చాలా ముఖ్యమైన విషయంగానే తీసుకోవాలి. ఎక్కువసార్లు కాఫీ, టీలు కూడా ఆరోగ్యానికి అంత మంచివి కావు. కామెర్లు, క్షయ, కలరావంటివి రాకుండా ముందుగానే వ్యాక్సిన్‌లు తీసుకోవడం మంచిది. మానసిక ఒత్తిడులు, ఆందోళనలు దరిచేరనీయరాదు. అప్పుడే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా వుంటుంది. జీవితం హాయిగా ఆనందంగా గడిచిపోతుంది. ★

జనాభా దామాషాలో తెలుగుకథ

సాహిత్యం అంటే సమాజాన్ని ప్రతిబింబించడమే కనుక సాహిత్య చిత్రణ అంటే సామాజిక పరిణామ క్రమాన్ని, దాని స్వరూప స్వభావాల్ని - అది ప్రజల జీవితాల్లో, దృక్పథాల్లో తెచ్చిన మార్పులను, దాని వైఫల్యాలను వివరించడమో, విశ్లేషించడమో అని అర్థం. ఇవన్నీ కథలో చిత్రించడమే సామాజిక కథకుల, నవలాకారుల కర్తవ్యం. అందుకు పలు శాస్త్రాలు అధ్యయనం-అవగాహన, సామాజిక ఆచరణ, పర్యటనలు, విభిన్న సంస్థలతో, ఉద్యమాలతో సంబంధాలు ఎంతో అవసరం. ఈ సామర్థ్యాన్ని సాధించి తమ కథల్లో సమాజాన్ని విశ్లేషించి చూపే కథకులే సమగ్ర సామాజిక కథకులు. అలా విశ్లేషించే విమర్శకుడే సమగ్ర సామాజిక సాహిత్య విమర్శకులు అని తేల్చి చెప్పడం "సమగ్ర సామాజిక కథ - సాహిత్య విమర్శ - తాత్త్విక భూమిక"లో చూడవచ్చు. గత దశాబ్దంలో బి.సి., ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి వందలాది రచయితలు రావడంతో సాహిత్యంలో అప్పటిదాకా రికార్డు కాని జీవితాలు మొదటిసారిగా రికార్డయ్యాయి అంటూ "గత దశాబ్ద బి.సి. సాహిత్య తీరుతెన్నులను విశ్లేషించిన బి.ఎస్.రాములు జీవితాన్ని గెలుచుకోవడం ఎలాగో, ఆత్మవిశ్వాసం పెంచుకోవడం ఎలాగో బి.సి. కథలు తెలుపుతాయని నిర్ధారిస్తారు. రచయితలు, విమర్శకుల కులాలేమిటో తెలియజేయడం ఈ వ్యాసం ప్రత్యేకత. అలాగే "గత దశాబ్దిలోని మరికొన్ని దళిత కథలు" అనే వ్యాసంలో ఐదేళ్ళలో దళిత కథ బహుముఖాలుగా విస్తరించిన వైనాన్ని వివరిస్తూ - అప్పటి సిద్ధాంతాలు, ఉద్యమాలు అందుకు దోహదం చేశాయంటూ విశ్లేషించి చూపారు.

గత యాభైఏళ్ళ తెలుగు సమాజ పరిణామాలను ప్రాంతాల వారీగా, కులాల వారీగా, భాషల వారీగా, వయస్సుల వారీగా, దృక్పథాల వారీగా, జీవితాల వారీగా, ఉత్పత్తి సంబంధాల వారీగా వాటిని కథావస్తువుగా స్వీకరించిన తీరును ప్రాంతీయపరంగా, కులాల వారీగా విశ్లేషించడం "50 ఏళ్ళ తెలుగు కథ - తీరుతెన్నులు" వ్యాసంలో కన్పిస్తుంది. జనాభా దామాషాలో ప్రాతినిధ్య కథలు - కథకులు ఏ నిష్పత్తిలో రావాలో సూచించడం రచయితలోని రాజకీయ చైతన్యానికి నిదర్శనం. జనాభా లెక్కలతో సృజనాత్మక సాహిత్యాన్ని నిర్దేశించగలమా? అక్షరాస్యత, పఠనీయత అన్ని వర్గాలలో పెంపొందినా కూడా వారి అభిరుచులు రచనాశక్తికి అనుగుణంగా లేకపోతే ఆ దామాషాలో రచనలను ఆశించలేము కదా! రచయితలకు సరైన ఆర్థిక ప్రోత్సాహం లేకపోవడం వల్ల చాలా మంది రచనా వ్యాసంగాన్ని తమ ప్రధాన వ్యాపకంగా పెట్టుకోలేదన్న సంగతిని కూడా మనం గుర్తించాలి కదా! ఏ రచయిత అయినా తనకు తెలిసిన జీవితాన్ని మాత్రమే చిత్రీకరించడానికి ప్రయత్నిస్తారు. అలాగని అతను రాయని వాటిని, రాయలేని వాటిని చూపించి అతని ప్రతిభను కించపరచలేము. ఈ వ్యాసానికి సంబంధించిన ఇతరేతర సందేహాలను పేర్వారం జగన్నాథంగారి "కథాక్రమం బెట్టిదనిన" వ్యాసం చదివి తెలుసుకోవచ్చు. "ఒక దశాబ్దంలో వస్తు-శిల్ప వైవిధ్యంతో బహుముఖాలుగా విస్తరించిన తెలుగుకథ"లో గిడసబారుతున్న పాతకథకులు - పాత దృక్పథాలను వివరిస్తూ, గత దశాబ్దిలోని కథా సాహిత్యపు అభివృద్ధి క్రమాన్ని వివరంగా తెలియజేశారు. మంచికథలను అందించే ఉద్దేశంతో కథాసంకలనాలను వెలువరిస్తున్న ఒక సంస్థ దశాబ్దకాలం పాటు వెలువరించిన సంకలనాల్లో తెలంగాణా కథకు, దళిత బహుజన కథలకు చోటు కల్పించకపోవడం వెనుకవున్న అన్యాయాలను, వారి ఉద్దేశాలను "కథ సంకలనాల్లో, కొరవడ్డ సామాజికత" అనే వ్యాసంలో వివరంగా తెలియజేశారు. తెలుగు విశ్వవిద్యాలయం తరపున అచ్చు వేసిన తెలుగు కథ 1998, 1999 సంకలనాలు తెలుగులో వస్తున్న అద్భుతమైన శిల్పవైవిధ్యానికి ఆనవాళ్ళుగా నిలుస్తాయి. పాతతరం రచయితలు వెనుకబడిపోగా, కొత్త తరం రచయితలు ఎలా ముందుకు తోసుకువస్తున్నారో ఈ సంకలనాలు స్పష్టం చేస్తాయంటున్నారు. అసలు కథాసంకలనాలు ఎలా వేయాలి? వాటికి మార్గదర్శక సూత్రాలేమిటి? వివరిస్తూ "కొన్ని మంచికథల చెత్తసంకలనం వందేళ్ళ తెలుగు కథ" అని నిరూపిస్తూ - చాలామంది కథల్ని, కథకులను ఎన్నో సామాజిక పరిణామాల్ని వదిలేయడం కోసమే ఈ సంకలనం వెలువడిందని తెలియజేస్తున్నారు. తెలుగు కథా సంకలనాల్లో తెలంగాణా కథల నిష్పత్తి వివరాలను, తెలంగాణా కథకుల కథా సంపుటాల జాబితాను కూడా ఇవ్వడం విశేషమే. డా॥ కె.లక్ష్మీనారాయణ 'దళిత కథలు' ఏడవ భాగానికి బి.ఎస్.రాములు రాసిన ముందుమాటలో, కాలువ మల్లయ్య మరచిన కథకులు "తెలంగాణా కథంతేనా' అనే కొనసాగింపు వ్యాసం కూడా ఇందులో వుంది.

రచయితలు, సంకలనకర్తలు స్వార్థం, సంకుచితత్త్వం వదులుకుంటేనే తెలుగు కథ బాగుపడుతుందనే రచయిత వాదనతో ఎవరికీ పేచీ ఉండాల్సిన అవసరం లేదని ఈ పుస్తకం చదివితే తెలిసిపోతుంది. ఇలాంటి వ్యాసాలు ఆత్మస్తుతి, పరనిందలకు అతీతంగా ఉండాలని ఆశించడం అత్యాశే మరి. ఈ పుస్తకం మొదటి సగభాగం తెలంగాణా కథకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తే, మిగతా సగభాగం రచయిత గొప్పదనాన్ని తెలియజేయడానికి కేటాయించబడింది.

- కె.పి.అశోక్ కుమార్



సమగ్ర సామాజిక కథ
తాత్విక భూమిక,
"50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు"
రచన : బి.ఎస్.రాములు
ప్రచురణ మరియు ప్రతులకు : విశాల సాహిత్య అకాడమి, హైదరాబాద్,
వెల : రు.250/-, పేజీలు : 276

స్వీకారం

చలివేంద్రం (కథల సంపుటి)
రచన : జాతశ్రీ; **వెల :** రు.75/-; **ప్రతులకు :** వి.ఎఫ్.ఎస్. కస్తూరి బాయి, సృజనాలయం, విద్యానగర్ కాలనీ, కొత్తగూడెం; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్.



పినాకినీ తీరంలో మహాత్మాగాంధీ
సంపాదకులు : ఇ.ఎస్.రెడ్డి, ఆర్.సుందరరావు; **వెల :** రు.50/-; **ప్రతులకు :** ఆర్.సుందరరావు, 10-40-15 డి, జనతాపేట, కావలి; ఆర్.సత్యనారాయణ, 17/535, చాకలివీధి, నెల్లూరు; ఆర్.సురేష్, 9-1-1/108, బాపునగర్, లంగర్‌హౌస్, హైదరాబాద్.


సింహాచలం

ఒకనాడు మత్స్యకారులు నివసించే గ్రామం. నేడు ఉక్కు నగరం, రాష్ట్రంలో పెద్ద రేవు పట్టణం.. దేశంలో కెల్లా పెద్ద నౌకా నిర్మాణ కేంద్రం.. పెద్ద వాణిజ్య, పారిశ్రామిక నగరం.. వందల కిలోమీటర్ల పొడవునా ఆహ్లాదం కలిగించే సముద్ర తీరం.. అరకువ్యాలీ.. బొర్రా గుహలు.. సింహాచల నరసింహస్వామి ఆలయం.. దట్టమైన అడవులు, అందమైన ప్రకృతి.. మొత్తంగా పర్యాటకుల స్వర్గధామం. అదే విశాఖ జిల్లా.



పర్యాటకుల స్వర్గధామం విశాఖ జిల్లా

శేషు

అశోకుడి మొదలు అనేక మంది రాజుల పాలన చూసిన విశాఖ నగరం బ్రిటిష్ పాలనలో పెద్ద ఓడరేవుగా ఎదిగింది. పసిమికాంతుల ఇసుకతిన్నెల రామకృష్ణా మిషన్ బీచ్, నగర శివార్లలో సింహాచలం గుడి, తూర్పుకనుమల్లోని కైలాసగిరి, ఆంధ్రా యూనివర్శిటీ, ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్, ఉక్కు ఫ్యాక్టరీ, ఓడరేవు, నౌకానిర్మాణ కేంద్రం ఇలా ఎన్నో విశేషాలు, చూడదగ్గ ప్రదేశాలు విశాఖ నగరంలో ఉన్నాయి. సముద్రపు ఒడ్డున డాల్ఫిన్ ఆకారంలో ఉండే డాల్ఫిన్స్ నోస్ పర్వతం విశాఖ నగరానికి హైలైట్. నగరానికి దక్షిణ భాగాన గల ఈ పర్యాటక ప్రాంతం అద్భుతంగా ఉంటుంది. తూర్పు కనుమల్లోని కైలాసగిరి కొండలు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ కొండపై నుండి విశాఖ నగరం మొత్తాన్ని వీక్షించగలగడం ఒక మరచిపోలేని అనుభూతి.

రుషికొండ బీచ్

బంగారు వర్ణంలో ఉండే ఇసుకతో అద్భుతమైన అనుభూతిని మిగిల్చే సముద్రతీరం రుషికొండ వద్ద ఉంది. రుషికొండ బీచ్ ఒకసారి చూస్తే జీవితంలో మరచిపోవడం కష్టం. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని తిలకించే వారికోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ వారు పున్నమి పేరుతో ఒక అతిథిగృహాన్ని నిర్మించారు.

భీమిలిగా పేరుపొందిన భీమునిపట్నం గోస్తని నది ముఖద్వారం వద్ద ఉంది. ఇక్కడి బీచ్ కూడా పర్యాటకులకు ముచ్చట గొలుపుతుంది. శిధిలావస్థలో ఉన్న డచ్‌వారి కోట, ఆనాటి డచ్ అధికారుల సమాధులు వారి వైభవాన్ని చాటి చెబుతాయి.

అరకులోయ, బొర్రాగుహలు

విశాఖ జిల్లా అంటే ముందుగా గుర్తుకు వచ్చేది అక్కడ ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అరకులోయ, బొర్రాగుహలు. సముద్ర మట్టానికి 610 మీటర్ల నుండి 915 మీటర్ల ఎత్తులో 36 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న అరకులోయ విశాఖ నగరానికి 112 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రకృతి అందాలన్నీ తనలో ఇముడ్చుకున్న అరకులోయలో నివసించే గిరిజనులకు ఇంతవరకు ఆధునికుల నాగరికత అంటలేదు. అమాయక గిరిజనులు తమ కట్టుబాట్లు, సంప్రదాయాలతోనే జీవితం గడుపుతున్నారు. ఇక్కడి గిరిజనుల ధింసా, మయూరి నృత్యాలు దేశవ్యాప్తంగా పేరుపొందాయి. అరకులోయ వాతావరణం పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తుంది.

పది లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడినవిగా భావిస్తున్న బొర్రాగుహలు విశాఖ నగరానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అడవుల నడుమ ఉన్న ఈ గుహలను పర్యాటక శాఖవారు ఇటీవల అభివృద్ధి చేస్తున్నారు. లోపల ఒక శివలింగం, కామధేనువు విగ్రహాలు చూడవచ్చు. గుహల్లోపలి ప్రదేశం పర్యాటకులను అద్భుత లోకాలకు తీసుకువెళుతుంది. అరకు, బొర్రాగుహలకు రైలు, రోడ్డు మార్గాల్లో వెళుతుంటే గుహలు, లోయలు, అడవులు ఎంతో ఆహ్లాదం కలిగిస్తాయి. ★

రుషికొండ బీచ్


బొర్రాగుహలు

భారతీయ శాస్త్రీయ నృత్య కళలలో ఇటీవలి అర్ధ, ముప్పాతిక శతాబ్దంలో తనదైన విలక్షణాలతో చేరిన నాట్యరీతి ఒడిస్సీ. దక్షిణ భారతంలోని ఒరిస్సా రంగభూమిగా ఆరంగేట్రం చేసి దేశ విదేశాల్లో పేరు తెచ్చుకోగలిగింది. అలాంటి ఒడిస్సీ నాట్యం అనగానే గుర్తుకు వచ్చేపేరు మహాగురు కేళూచరణ్ మహాపాత్రో.



గురు కేళూచరణ్ అంటేనే... ఒడిస్సీ నృత్యం

త్రినేత్ర

దక్షిణ భారతంలోని ఈ నృత్యరీతులు ఒక్కో రీతి ఒక్కో ప్రాధాన్యత గలవి. భరతనాట్యం అభినయానికీ, కూచిపూడి నృత్య నృత్తాలకు, కథక్ నృత్తానికి, మణిపురీ, మోహినీయాట్టం లాస్యానికి ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ ఒడిస్సీ నృత్యరీతి ఆంగికాభినయం, రసభావ ప్రధానంగా రూపొందింది.

అప్పటికే భరతుని ద్వారా 'దైవాంశ' సంభూతంగా రూపొందిన భరతనాట్యం - దాని శాస్త్రం మాత్రమే ప్రాచుర్యం పొంది వున్న దశ. భరతనాట్యం సరసన కథక్, కథాకళి, మణిపురీ, మోహినీయాట్టం చేరాయి. ఈ ఐదు నాట్యశాస్త్రాలు మాత్రమే నృత్యంగా ఆమోదిస్తున్న రోజుల్లో ఒకవైపు కూచిపూడి నృత్యం, మరోవైపు ఒడిస్సీ నృత్యం తమ గుర్తింపుకై పెనుగులాడి పోరాడి సాధించాయి. ఆ పెనుగులాటలో ఎంతో కృషి తపస్సులా చేసి సాధించిన ఘనుడు కేళూచరణ్ గురూజీ. ఈ ఒడిస్సీ నృత్యరీతికి గుర్తింపు తేవడంలోనే కాదు, దానిని రూపకల్పన చేయడంలోనూ, దానికి శాస్త్రబద్ధత కల్పించడంలోనూ ఎంతో సంఘర్షణపడ్డారు కేళూబాబూ ఒరిస్సా అంతటా కేళూచరణ్‌ను (ప్రేమగా 'కేళూబాబూ' అని పిలుచుకుంటారు) ఒక నాట్యరీతిని రూపొందించటంలోనూ, దానిని ప్రాచుర్యంలోకి తేవటంలోనూ అంతటి సంఘర్షణ పడటానికి గురుకేళూదాకి ఉన్న సాంస్కృతిక, కుటుంబ సామాజిక నేపథ్యం ఎంతో ఉత్కంఠ భరితమైనది.

1926 జనవరి 28వ తేదీన ఒరిస్సా రాష్ట్ర, పూరీ జిల్లా రఘురాజ్‌పూర్‌లో చింతామణి మహాపాత్రో కుమారుడిగా జన్మించారు. ఆ గ్రామమే ఓ కళల గూడు. పుట్టిన వాతావరణమే కళామయం. చిన్ననాడే ఒరియా జానపద నృత్యం అయిన "గోటిపువా" ప్రదర్శించేవాడు. తండ్రి చింతామణి కళాప్రియుడు. మోహన్ సుందర్ దేవ్ అనే గురుసారధ్యంలో నడుస్తున్న 'రసలీల' అనే కళాసంస్థలో చేర్పించాడు. 'కృష్ణలీలలు' నృత్యనాటికను ఊరూరా ప్రదర్శించాడు. యువకేళూ చరణ్ విద్యతో పాటు నృత్యాన్నీ సమంగా అభ్యసించారు.

పుట్టుకరీత్యా నిచ్చెనమెట్ల వర్ణ సమాజపు పై



మెట్టువాడైనప్పటికీ తన కళకు ఓ విలక్షణతను, వైవిధ్యాన్ని చేకూర్చాలన్న తపనలో తన కుల హద్దులూ, గోడలూ దాటాడు. ఆయన పేదరికంలో వక్క తోటల్లో కూలీగా ఈ సమాజపు కాలే కడుపుల శ్రామికతనాన్ని స్వయంగా రుచి చూశాడు. ఒరిస్సాగా పిలుచుకుంటున్న ఒకనాటి ఉత్కళ (కళింగ) బౌద్ధం యొక్క ప్రభావం వల్ల కులకట్టుబాట్లు మన రాష్ట్రానికున్నంత జటిలంగా లేవు. పూరీ జగన్నాథ దేవాలయం కేళూచరణ్‌కు ఒక సామాజిక పాఠశాల. ఒకప్పటి గిరిజనుల దేవాలయమైన పూరీ జగన్నాథ్ దేవాలయం ఇప్పుడు మహంత్‌ల, పండాల ఆధిపత్యంలోకి పోయినా చందన్ ఉత్సవం మాత్రం గిరిజనులే నిర్వహిస్తారు. ఆ సందర్భంగా 'మహరీ' (మాలలు) నాట్యం చేయడం వారి హక్కు, సంప్రదాయం. వారి మహరీ నృత్యాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. ఆంగికాభినయం, రసభావ ప్రదర్శనలతో కూడి ఉండే ఒరియా జానపద నృత్యం 'చౌ-నాట్యం'ను శోధించారు. వాటి నుంచి గ్రహించి, తనదైన కాలజతులు, దరువులు, మేళవింపులతో ఈ ఒడిస్సీ నృత్యరీతిని అభివృద్ధి చేశారు. తన ఒడిస్సీ నాట్య శక్తిని తన తండ్రిగా భావించిన పూరీ జగన్నాధునికే అంకితం చేశానంటారా నాట్యగురు. ఈ ఒడిస్సీతో ఎంతటి అభినివేశం అంటే తానే కాదు, తన భార్య లక్ష్మీ ప్రియ, కొడుకు రతికాంత్ మహాపాత్రో, కోడలిని కూడా ఒడిస్సీ నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారు.

ఒక నాట్యరీతిని దాని విలక్షణతతో ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టడం ఒక ఎత్తయితే, దానిని ప్రదర్శనాపూర్వకంగా ఖ్యాతిలోకి తేవడం మరో ఎత్తు. ఆ పని ఆయన శిష్యురాలు సంజుక్తా పాణిగ్రాహి చాలా

ప్రతిభావంతంగా నెరవేర్చింది. సంజుక్తా పాణిగ్రాహి, మీనలీ మిశ్రా, కుమ్‌కుమ్ మహంతీ, సోనాల్‌మాన్‌సింగ్, ఇతేయాన చితారస్తీ వీరి శిష్యుల్లో కొందరు. ఈ ఒడిస్సీ రీతిలో మానభంజనం, శారదాలీల, రాధా ప్రేమామృతం, శ్రీకృష్ణరాసలీల, దశావతార తదితర ఎన్నో డ్యాన్స్ బాలేలు రూపొందించారు. జపాన్, జర్మనీ తదితర విదేశాల్లో కూడా వీరి బృందం అనేక ప్రదర్శనలిచ్చింది.

నిరుత్సాహ ఛీత్కార, తిట్లు శాపనార్థాల గుండా తదేక దీక్షగా అవిశ్రాంత కృషి చేసిన గురుకేళూచరణ్ మహాపాత్రోకు 1972లో పద్మశ్రీ, డాక్టరేట్, కాళిదాస్ అవార్డులు, 1989లో పద్మభూషణ్, 2000లో పద్మవిభూషణ్ పురస్కారాలు వచ్చాయి. 1994లో కేళూచరణ్‌జీ, వారికుమారుడు రతికాంత్ మహాపాత్రో కలసి భువనేశ్వర్‌లో 'శ్రీజన్' అనే నృత్యకళాసంస్థను స్థాపించారు.

2004 మార్చి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకూ గురుకేళూచరణ్ మహాపాత్రో హృదయం లబ్‌డబ్‌లు జతిస్వర లయాత్మికంగా నృత్యం చేస్తూనే ఉంది. 11వ గంటలో ఎన్నటికీ మరువేలని ఒడిస్సీ నృత్య భంగిమలో స్థంభించిపోయింది. ఆయన గుండె ఆగి మరణించినా, కళాభిమానులందరి గుండెగుడి ప్రాసాదాలలో 77వ ఏట మన హైదరాబాద్ రంగస్థలంపై యువకునిలా నాట్యం చేసినట్లుగా ఒడిస్సీ నృత్యం చేస్తూనే ఉంటారు. ★

ఏయ్ఁ... ఆటో...



సూర్యుని నులి వెచ్చని కిరణాలు
పొగమంచును తాకుతున్న వేళ
నగరమంతా హడావిడి...
'రసూల్' ఇచ్చిన తేనీటి వేడి సెగ
నా బ్రతుకు బండి నరనరాన
ఉత్సాహాన్ని నింపుతూ వున్నది...
ఇంతలో... ఏయ్ఁ... ఆటో...
ఫ్చ్ఁ...
నేనంటే ఓ పనిముట్టన్నట్టు
పని ముట్టంటే నేనన్నట్టు...
అసలు నాలో రక్తచలనం వుందా
అని నాకే అనుమానం కలిగేటట్టు...
"మార్క్స్" భావం కొరవడి జన సంద్రంలో
చుక్కాని లేని నావనై
నేను... నా ఆటో...
పారే సెలయేటి నుండి
గట్టున పడ్డ మీనమల్లే
.. నా ప్రాణం...
నా జీవన పయనమెటు...?
అర్థరాత్రి రెండింటికి ఇంటికి
తెల్లవారు అయిదింటికి జీవన పోరుకి
రాత్రంతా నిద్రను పోగేసి
నల్లని తారు రోడ్డంతా
మెల్లగా కలియజూసినా
నిద్రలో తాగుబోతుల కలవరింతలు తప్ప
నా బ్రతుకు బండిని
ముందుకు నెట్టడానికి ఎవరూ రారేమి?
హోరు వర్షపు చీకటి రాత్రిని
చీల్చుకుంటూ...
'ఆటో'.. అనే కేక ఎటువైపు నుంచైనా
వినిపిస్తుందేమోనని
అలవాటుగా చూశాయి..నా ఆటో చెవులు...

- రాణా



ఏం దోపిడి?

పల్లవి : ఏం దోపిడేం దోపిడేందోపిడి
ఈ దోపిడి అసలు రంగు తెలుసుకొనండి
ఎర్రజెండా చేతబట్టి పోరుకు రండి. ...ఏం...

చరణం : ప్రజారాజ్యమంటరు జనమే దైవమంటరు
ప్రజల కొరకే మేమంటరు ప్రజల డబ్బే తింటరు
కూలిరేట్లు పెంచమంటె కుదరదు పొమ్మంటరు
ఎమ్మెల్యే జీతాలను పెంచుకుంటపోతరు ...ఏం...

విత్తనాలు కొనేకాడ పురుగు మందు కొనే కాడ
పత్తినమ్ముకొనే కాడ గింజలమ్ముకొనే కాడ
పంటలోనులిచ్చే కాడ సబ్సిడి దరఖాస్తు కాడ
పర్సెంటేజిల పేర ముచ్చటైన ముడుపులు
...ఏం...

అప్పులిచ్చి పొలాల్ గుంజి కూలోళ్ళను జేస్తరు
అడగబోతే చితకతన్ని అంతే పొమ్మంటరు
ఓటిచ్చిన పదవులతో లూటీ చేస్తుంటరు
పోటీపడి నీతిపరుల చేతులు కట్టేస్తరు
...ఏం...

కులం పేర మతం పేర చీలికలను తెస్తరు
పేదజనం ఒక్కటిగా కలువకుండ జూస్తరు
కర్మపేర దరిద్రాన్ని మనకు పంచిపెడ్తరు
కడుపు మండి ఎదిరిస్తే కాటికి పంపిస్తరు
...ఏం...

సన్నకారు చిన్నకారు రైతులతో చేయి కలిపి
శ్రమచేసే కూలిజనం కార్మికులూ భుజం కలిపి
తేనె దొంగలను తరిమే తేనెటీగ దండులుగా
పోరాడగ కదలినపుడే రైతు కూలి రాజ్యమురా
...ఏం...

- వల్లభాపురం జనార్ధన

న్యాయ సలహాలు

- జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఆస్తి హక్కు సంక్రమిస్తుందా? లేదా?

మా నాయనమ్మ వాళ్ళ అక్కయ్య మా మేనత్తని (మా నాన్నగారి అక్క) చేరదీసి ఆమె ఆస్తిలో కొంతభాగం ఆమెకి, కొంతభాగం మా నాన్నకి రాసింది. (ఆస్తి వివరాలు బజార్లో ఓ షాపు, ఇద్దరికీ సమానంగా, ఇల్లు రెండొంతులు ఆమెకి, ఒక వంతు మా నాన్నకి రాసింది) అయితే బజార్లో షాపు సుమారు 5 ఏళ్ళక్రితం నాకు తెలియకుండా అమ్మేశారు. వారసుడిగా నా సంతకం లేకుండా, మా మేనత్త కొడుకుల్లో పెద్దాయన కూడా సంతకం పెట్టలేదు. ఆ షాపులో ఉండే అతనే ఆ షాపుని మార్కెట్ ధరకంటే తక్కువకి కొనుక్కున్నాడు. అమ్మిన విషయం నాకు తెలిసేటప్పటికి చాలా టైమ్ అయిపోయింది. నేను నిరుద్యోగిని. మా నాన్నగారు ఇంట్లో కూడా ఆడపిల్లలకి వాటా ఇస్తానంటున్నారు (నాకు ఇద్దరు చెల్లెల్లు) ఈ పరిస్థితులలో కొట్టు అమ్మినందుకు (వారసత్వపు వాళ్ళమైన మా చేత అమ్ముకునేటప్పుడు సంతకం పెట్టించుకోలేదు కనుక) కొన్న వాళ్ళ మీద, అమ్మిన వాళ్ళ మీద ఇప్పటికైనా చర్య తీసుకోవచ్చా? ఇల్లు నా పేరున దక్కాలంటే నేను ఎలాంటి చర్యలు తీసుకోవాలి? నేను చాలా బీదవాడిని. ఖర్చులు భరించి వాళ్ళమీద కోర్టులో కేసు పెట్టలేనటువంటి వాడిని. కాబట్టి ఆస్తిని కాపాడుకోవాలంటే నేనేం చేయాలో సవివరంగా తెలియపర్చగలరు.

- ఇమ్మానేని వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు,
కోకావారి వీధి, బచ్చుపేట, మచిలీపట్నం.

మీ తండ్రి గారికి వారి మేనత్త నుండి సంక్రమించిన ఆస్థి అది. ఆమె రాసిన పత్రం బహుమతిగా ఇచ్చిందా? లేక తరతరాల వరకు అనుభవించమనే ఇచ్చిందా అనే విషయం మీరు రాయలేదు. ఆ ఆస్థి మీ తండ్రి పేరనే రాసి ఇచ్చింది కాబట్టి అది తన ఇష్టం వచ్చినట్లు చేసుకునే హక్కు మీ తండ్రి గారికుంది. మీరు దావా వేసినా అది నిలవజాలదు. "ఆడపిల్లలకు కూడా ఆస్థిలో హక్కు ఉంటుంది" కాబట్టి మీ చెల్లెళ్ళకు కూడా భాగం ఇవ్వొచ్చు.

డబ్బు జీవితాంతం ఇస్తారా?

నాకు ఎస్.సి. కోటా కింద రెండేళ్ళ క్రితం ఐ.ఓ.సి. పెట్రోల్‌బంక్ రిటైల్ అవుట్‌లెట్ వచ్చింది (నన్ను ఇంటర్వ్యూకు పంపిన వ్యక్తి 15 లక్షలిచ్చి ముందుగానే అధికారులను కొనేశారు) నెలకు రెండు వేలు, రెండేళ్ళకు 10% పెంచేటట్లు అని చెప్పి ఇంటర్వ్యూకు ముందు ఖాళీ దస్తావేజుల మీద సంతకాలు తీసుకున్నారు. "నీ దగ్గర ఆస్తేం లేదు కదా మేం మోసం చేసి తీసుకోవటానికి, చాలా ఖర్చు పెడుతున్నాం. ఈ జాగ్రత్త మాకు తప్పదు" అన్నారు. వ్యాపారం ప్రారంభించి సంవత్సరం కావస్తోంది. లైసెన్స్, బి.ఫాం, పాన్ (పర్మినెంట్ అక్కౌంట్ నెంబర్) నా పేరు మీదనే వున్నాయి. నాపేర బ్యాంకులో డబ్బులు వుంచి అప్పుడప్పుడు చెక్కుల మీద సంతకాలు తీసుకెళ్తుంటారు. బంక్‌లో అందరూ వారి మనుషులే. నాకు 33 సంవత్సరాలు. డిగ్రీ వుంది. కాని ప్రతిభ లేదు. ఉద్యోగం తెచ్చుకోలేక పోయాను. పి.ఎమ్.ఆర్.వై., ఎస్.సి.లోన్స్ లాంటి ఉపాధి పథకాలు పలుకుబడి, డబ్బు వున్న వారికి ఉపయోగపడుతున్నాయి. నాలాంటి వారికి ఉపకరించలేదు. ఆ రోజు ఇంటర్వ్యూకు వచ్చిన. 55 మంది నా కన్నా అర్హత ఎక్కువ వున్న వారే. మొట్టమొదటిసారి అవినీతిని ప్రోత్సహించినట్టయింది. పేదరికం, నిరుద్యోగం వల్ల ఇలా చేశాను. ఇంతకీ నా సందేహం ఏమంటే

1) ఐ.ఓ.సి. వారు ఒరిజినల్స్ చూశారు. కాని తీసుకోలేదు. ఎందుకని? ఉద్యోగం లాంటి ఈ ఉపాధిని ఇచ్చినప్పుడు డిగ్రీ సర్టిఫికెట్ తీసుకుంటారా ? లేదా?

2) వాళ్ళు ఇస్తానన్న డబ్బులు జీవితాంతం ఇస్తారా లేక పై అధికారుల్ని మభ్యపెట్టి నన్ను మోసం చేయటానికి అవకాశం ఉందా? దయ చేసి తెలుపగలరు.

- బి.సురేష్, రెంటచింతల

సురేష్‌గారు ప్రభుత్వ ఉద్యోగం లాంటి ఉపాధే కాదు. ఉద్యోగం ఇచ్చినా కూడా ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు ఎవరూ తీసుకోరు. మీరు పెట్టిన జిరాక్స్‌లకు సరి చూసుకుని మన సర్టిఫికెట్స్ మనకే ఇస్తారు.

మీరు వారికి బాధ కల్గించనన్ని రోజులు డబ్బులు ఇస్తారు. చాలా తెల్లకాగితాలపై సంతకాలు చేశామంటున్నారు. వారు వారికిష్టం వచ్చినట్లు రాసుకునే అవకాశం మాత్రం ఉంది. బంక్ మీ పేరు మీద ఉన్నంతకాలం వారు మీకు డబ్బు ఇస్తూనే ఉంటారు. డీలర్‌గా మీ పేరు మీద ఏవైనా అక్రమాలు నమోదయితే రద్దు చేసే అధికారం ఐ.ఓ.సి. వారికే ఉంటుంది.

రుచి



చిలగడ దుంపలతో గులాబ్‌జామ్

కావలసిన వస్తువులు:

ఎర్ర చిలగడ దుంపలు	:	పావు కిలో
నెయ్యి లేక డాల్డా	:	పావు కిలో
పేరిన నెయ్యి	:	కొంచెం
చక్కెర	:	పావు కిలో
మైదా	:	రెండు స్పూనులు

తయారుచేసే విధానం:

చిలగడ దుంపలు పుచ్చులు, పీచులేనివి ఏరి తీసుకోవాలి. వాటిని శుభ్రంగా కడిగి కొద్దిగా నీళ్ళు పోసి మెత్తగా ఉడికించాలి. ఉడికిన దుంపలపై తొక్క ఒలిచి లోపల పీచు ఉంటే శుభ్రంగా తీసివేయాలి. మెత్తగా గుజ్జులా అయ్యేటట్లు చేతితో బాగా పొడి చేయాలి. మైదా పిండిలో పేరిన నెయ్యి కలపాలి. దీనిని మెత్తగా చేసిన చిలగడ దుంపలకు కలపాలి. ఈ పిండిని చిన్న ఉండలుగా చేసుకోవాలి.

వెడల్పాటి గిన్నెలో పంచదార పోసి స్టౌ మీద పెట్టి లేతపాకం పట్టాలి. పాకాన్ని దించి కింద పెట్టుకోవాలి. నెయ్యి లేక డాల్డాను బాండీలో పోయాలి. (రిఫైన్డ్ నూనెనైనా వాడవచ్చు). అది కాగిన తరవాత చిలగడ దుంప గుజ్జు ఉండలు కొంచెం కొంచెం వేసుకొని దోరగా వేగాక పాకంలో వేయాలి. ఉండలు గుల్లగా విచ్చుకొని లోపలికి పాకం పోయి తినడానికి మెత్తగా, రుచిగా చాలా బాగుంటాయి.



ఆలు బోండాలు

కావలసిన వస్తువులు:

ఆలు గడ్డలు	:	అర కిలో
పచ్చి మిరపకాయలు	:	6 లేదా 7
అల్లం	:	చిన్న ముక్క
వెల్లుల్లి	:	4 రెబ్బలు
కారం	:	చిటికెడు
కొత్తిమీర	:	ఒక కట్ట
శనగపిండి	:	పావు కిలో
ఉప్పు	:	తగినంత
నూనె	:	కావలసినంత

తయారుచేసే విధానం:

ఆలుగడ్డల్ని ఉడకబెట్టి పొట్టు తీయాలి. దీనికి ఉప్పు, కారం, పచ్చి మిరపకాయ ముక్కలు, అల్లం ముక్కలు, తరిగిన కొత్తిమీర కలిపి ముద్దలా చెయ్యాలి. చిన్న చిన్న వడలుగా చేసి పక్కనుంచాలి. శనగపిండి తీసుకొని అందులో చిటికెడు ఉప్పు, కారం వేసి నీళ్ళుపోసి బజ్జీల పిండిలాగా కలుపుకోవాలి. తయారు చేసి ఉంచిన వడల్ని అందులో ముంచి వేడినూనెలో వేయించాలి. దోరగా వేగాక తీసుకోవాలి. వేడిగా ఉన్నప్పుడే పచ్చడితో నంజుకొని తింటే చాలా రుచిగా ఉంటాయి.

వంటలు పంపవలసిన చిరునామా:

రుచి, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోక్‌నగర్, స్ట్రీట్ నెం:1
హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది